ప్రజా రిపబ్లిక్

ప్రతి అక్షరం ప్రజల కోసం

RNI No:/2023/87888

పాత్రికేయులు కావలెను

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న

ప్రజా రిపబ్లిక్

తెలుగు దినపత్రికలో తెలుగు రాష్ట్రాలలో బ్యూరోలు, జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ మరియు మండల స్థాయి పాత్రికేయులు కావలెను.

ఆసక్తి గలవారు సంప్రదించండి

9948814188 9985876888

Published From Nandyal : Cerculated in Nandyal,Kurnool,Kadapa,tirupathi,Prakasam, Krishna,Guntur,Nellore and All Distircts

సంపుటి - 03 సంచిక -184 | పేజీలు - 8 | వెల - 03/- | మంగళవారం 13 అక్టోబర్ 2026

మున్సిపల్ ఎన్నికలకు రిజర్వేషన్లు ఖరారు

106 మున్సిపాలిటీలు, 17 కార్పొరేషన్లకు తుది జాబితా విడుదల

ఆంధ్రప్రదేశ్‌లోని 17 కార్పొరేషన్లకు మేయర్ రిజర్వేషన్లు ఖరారు

5 బీసీ, 2 ఎస్సీ, 1 ఎస్టీ, 5 జనరల్ మహిళలకు కేటాయింపు

విజయవాడ, తిరుపతి సహా 4 స్థానాలు అన్‌రిజర్వ్‌డ్‌గా ప్రకటన

మున్సిపాలిటీలలో బీసీలకు 35, ఎస్సీలకు 14, ఎస్టీలకు 3 చైర్మన్ పీఠాలు

అన్ని కేటగిరీలలో కలిపి మహిళలకు 50 స్థానాలు కేటాయింపు

రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారికంగా ఉత్తర్వులు జారీ

అమరావతిఅక్టోబరు 12 రిపబ్లిక్ న్యూస్ : ఆంధ్రప్రదేశ్‌లో జరగనున్న పురపాలక ఎన్నికలకు సంబంధించి రాష్ట్ర ఎన్నికల సంఘం కీలక ప్రకటన విడుదల చేసింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 106 మున్సిపాలిటీలు, 17 మున్సిపల్ కార్పొరేషన్లలో చైర్మన్, మేయర్ పదవులకు రిజర్వేషన్లను ఖరారు చేస్తూ సోమవారం తుది జాబితాను ప్రకటించింది. ఈ ప్రకటనతో మున్సిపల్ ఎన్నికల ప్రక్రియలో ఒక ముఖ్యమైన ఘట్టం పూర్తయింది. ఇక అన్ని రాజకీయ పార్టీలు తమ అభ్యర్థుల ఎంపికపై దృష్టి సారించేందుకు మార్గం సుగమమైంది.ప్రకటించిన జాబితా ప్రకారం, 106 మున్సిపాలిటీలలో చైర్మన్ పదవులకు గాను బీసీ (వెనుకబడిన తరగతులు) మిగతాది 2లో...



అప్రూవర్‌గా మారండి

జ్ఞానేశ్‌కు రాహుల్ గాంధీ సూచన

200 మంది కేంద్ర ప్రభుత్వ అధికారులు మాతో టచ్‌లో ఉన్నారు..

జ్ఞానేశ్ కుమార్ తనకు సందేశాలు పంపుతున్నారని రాహుల్ వెల్లడి

జ్ఞానేశ్ అసలు నేరస్థుడు కాదని.. సూత్రధారులు వేరే ఉన్నారని వ్యాఖ్య

సీఈసీని తొలగించే వరకు ఆందోళన కొనసాగుతుందని స్పష్టీకరణ

న్యూ ఢిల్లీ అక్టోబరు 12 రిపబ్లిక్ న్యూస్ : లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌పై తీవ్ర ఆరోపణలు చేశారు. ఆయన తనకు సందేశాలు పంపిస్తున్నారని వెల్లడించారు. మిగతాది 2లో...



ఆసుపత్రుల బిల్లులపై కేంద్రం సీరియస్..

వైద్య సేవల్లో పారదర్శకత పెంచేందుకు కేంద్రం కీలక నిర్ణయం

ఆసుపత్రుల్లో చికిత్స చార్జీలను స్పష్టంగా ప్రదర్శించాలని రాష్ట్రాలకు ఆదేశం

రోగులు ముందే ఖర్చుపై అంచనా వేసుకునేందుకు ఈ నిర్ణయం దోహదం

క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ చట్టం ప్రకారం ఈ నిబంధనలు అమలు చేయాలి




న్యూ ఢిల్లీ అక్టోబరు 12 రిపబ్లిక్ న్యూస్ : దేశవ్యాప్తంగా ఉన్న ఆసుపత్రులు, క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్లు తమ వద్ద అందించే వైద్య సేవలకు వసూలు చేసే చార్జీలను అందరికీ స్పష్టంగా కనిపించేలా ప్రదర్శించాలని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ రాష్ట్రాలు, మిగతాది 2లో...

పెట్టుబడులకు ఏపి స్వర్గధామం

కాకినాడ సీఐఐ ప్రాంతీయ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించిన పవన్ కళ్యాణ్

కాకినాడ, అక్టోబరు 12 రిపబ్లిక్ న్యూస్ : ఆంధ్రప్రదేశ్‌ను పెట్టుబడులకు స్వర్గధామంగా తీర్చిదిద్దుతున్నామని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అన్నారు. పారిశ్రామికవేత్తలు లాభాలకే పరిమితం కాకుండా దేశాభివృద్ధి, ప్రజల సంక్షేమం, యువతకు ఉపాధి కల్పనపై దృష్టి సారించాలని పిలుపునిచ్చారు.కాకినాడలోని జేఎన్టీయూలో నిర్వహించిన సీఐఐ ప్రాంతీయ సదస్సుకు మిగతాది 2లో...





ఆర్థిక శాస్త్రంలో రాబర్ట్ హాల్, మైఖేల్ వుడ్‌ఫోర్డ్‌కు నోబెల్

స్థూల ఆర్థిక స్థిరీకరణకు అవసరమైన సూక్ష్మ ఆర్థిక పునాదులపై పరిశోధనకు గుర్తింపు

స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న హాల్

కొలంబియా యూనివర్సిటీలో ప్రొఫెసర్‌గా ఉన్న వుడ్‌ఫోర్డ్

ప్రభుత్వాలు, కేంద్ర బ్యాంకుల ఆర్థిక విధాన నిర్ణయాలకు వీరి పరిశోధనలు ప్రయోనకరం

న్యూ ఢిల్లీ అక్టోబరు 12 రిపబ్లిక్ న్యూస్ : ఆర్థిక శాస్త్రంలో 2026 నోబెల్ బహుమతిని అమెరికా ఆర్థికవేత్తలు రాబర్ట్ ఈ. హాల్, మైఖేల్ వుడ్‌ఫోర్డ్‌కు ప్రకటించారు. స్థూల ఆర్థిక వ్యవస్థలో ఒడుదొడుకులను నియంత్రించేందుకు ఉపయోగపడే నమూనాల రూపకల్పనకు అవసరమైనమిగతాది 2లో...

ఐఏఎస్‌లకు పోస్టింగ్‌లు..

ఆమ్రపాలికి పర్యాటక, సాంస్కృతిక శాఖ కార్యదర్శి బాధ్యతలు

ఆగస్టు నుంచి జీఏడీలో వెయిటింగ్‌లో ఉన్న ఆమ్రపాలి

తొమ్మిది మందికి కొత్త పోస్టింగ్‌లు

మరో ఇద్దరు ఐఏఎస్‌లకు అదనపు బాధ్యతలు

అమరావతిఅక్టోబరు 12 రిపబ్లిక్ న్యూస్ : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్ర పరిపాలనలో కీలక మార్పులు చేసింది. మొత్తం 11 మంది ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ, కొందరికి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ బదిలీల్లో 2010 బ్యాచ్ ఐఏఎస్ అధికారిణి ఆమ్రపాలి కాటకు కీలకమైన పర్యాటక, సాంస్కృతిక శాఖమిగతాది 2లో...



తిరుపతికి మహర్దశ

రూ.3,222 కోట్ల పనులకు సీఎం చంద్రబాబు శ్రీకారం





అలిపిరి వద్ద భారీ ఇంటిగ్రేటెడ్ పిలిగ్రిమ్ టౌన్‌షిప్ నిర్మాణానికి శంకుస్థాపన

టీటీడీ ఉద్యోగుల కోసం 418 ఎకరాల్లో నివాస లేఅవుట్ అభివృద్ధికి ఆమోదం

భక్తుల సమాచారం కోసం 'వెంకటాద్రి యాప్'ను ఆవిష్కరించిన ముఖ్యమంత్రి

నగరంలో రూ.242 కోట్లతో 9 మాస్టర్ ప్లాన్ రహదారుల నిర్మాణానికి శ్రీకారం

అమరావతిఅక్టోబరు 12 రిపబ్లిక్ న్యూస్ : కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వర స్వామి కొలువైన తిరుపతి అభివృద్ధిలో మరో కీలక అధ్యాయం మొదలైంది. 'తిరుపతి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ' (తుడా) పరిధిలో సుమారు రూ.3,222 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి చంద్రబాబు సోమవారం శ్రీకారం చుట్టారు. మిగతా 2లో...


ఘోర ప్రమాదం

నలుగురి సజీవదహనం

విజయవాడ బైపాస్‌లో కాలిబూడిదైన ఈవీ కారు..

నంబూరులో ఫంక్షన్‌కు వెళ్లి వస్తుండగా జరిగిన దుర్ఘటన

మృతులు నున్న, నంబూరు ప్రాంత వాసులుగా గుర్తింపు



విజయవాడఅక్టోబరు 12 రిపబ్లిక్ న్యూస్ : విజయవాడ నగర శివార్లలోని పశ్చిమ బైపాస్ రోడ్డుపై ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. సోమవారం జరిగిన ఈ దుర్ఘటనలో నలుగురు వ్యక్తులు సజీవ దహనమయ్యారు. వారు ప్రయాణిస్తున్న ఎలక్ట్రిక్ కారు (ఈవీ) ప్రమాదానికి గురైన వెంటనే మంటల్లో చిక్కుకుని పూర్తిగా కాలి బూడిదైంది. ఈ ఘటనలో మరొకరు తీవ్ర గాయాలతో బయటపడగా, ఆయన పరిస్థితి విషమంగా ఉంది.మిగతాది 2లో...

ఈడీ, సీబీఐ సరిపోక ఈసీని వాడుకుంటున్నారు

కేంద్ర ప్రభుత్వం ఈసీని దుర్వినియోగం చేస్తోందన్న సీఎం రేవంత్

న్యూ ఢిల్లీ అక్టోబరు 12 రిపబ్లిక్ న్యూస్ : తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల కమిషన్‌పై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. ఈడీ, సీబీఐ, ఐటీ సంస్థలు సరిపోవన్నట్లుగా ఇప్పుడు మోదీ సర్కార్ ఎన్నికల కమిషన్‌ను (ఈసీ) కూడా దుర్వినియోగం చేస్తోందని ఆయన ఆరోపించారు. మిగతాది 2లో...



ఆర్థిక శాస్త్రంలో రాబర్ట్ హాల్, మైఖేల్ వుడ్‌ఫోర్డ్‌కు నోబెల్

(మొదటి పేజీ తరువాయి)

సూక్ష్మ ఆర్థిక పునాదులపై వారు చేసిన పరిశోధనకు ఈ పురస్కారం దక్కింది. స్టాక్‌హోమ్‌లోని రాయల్ స్వీడిష్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ సోమవారం ఈ విషయాన్ని ప్రకటించింది.

రాబర్ట్ ఈ. హాల్ స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీలో ఆర్థికశాస్త్ర ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. మైఖేల్ వుడ్‌ఫోర్డ్ కొలంబియా యూనివర్సిటీలో రాజకీయ ఆర్థికశాస్త్ర విభాగంలో ప్రొఫెసర్‌గా ఉన్నారు. వీరి పరిశోధనలు ఆర్థిక వ్యవస్థలో వృద్ధి, మాంద్యం వంటి పరిస్థితులను ప్రభుత్వాలు, కేంద్ర బ్యాంకులు మరింత సమర్థంగా ఎదుర్కొనేందుకు తోడ్పడతాయి. ఆర్థిక వ్యవస్థలో చోటుచేసుకునే మార్పులను అర్థం చేసుకుని తగిన విధాన నిర్ణయాలు తీసుకోవడంలో ఈ అధ్యయనాలు కీలకంగా నిలుస్తాయి.ఆర్థిక శాస్త్రంలో ఈ పురస్కారాన్ని అధికారికంగా 'ఆల్ఫ్రెడ్ నోబెల్ స్మారకార్థం స్వెరిజెస్ రిక్స్‌బ్యాంక్ ఆర్థిక శాస్త్ర బహుమతి' అని పిలుస్తారు. స్వీడన్ కేంద్ర బ్యాంకు 1968లో దీన్ని ఏర్పాటు చేసింది. 1969లో తొలిసారిగా ప్రదానం చేశారు. ఆల్ఫ్రెడ్ నోబెల్ తన వీలునామాలో పేర్కొన్న అసలు ఐదు నోబెల్ బహుమతుల్లో ఆర్థిక శాస్త్ర పురస్కారం లేదు. అయినప్పటికీ మిగతా నోబెల్ పురస్కారాలతో పాటే ఏటా డిసెంబర్ 10న దీన్ని అందజేస్తారు. 1896లో అదే రోజున నోబెల్ మరణించారు.2025లో ఈ బహుమతి జోయెల్ మోకిర్, ఫిలిప్ అఘియోన్, పీటర్ హోవిట్‌లకు లభించింది. సాంకేతిక పురోగతి, నూతన ఆవిష్కరణలు దీర్ఘకాలిక ఆర్థిక వృద్ధికి ఎలా దోహదపడతాయో వివరించినందుకు వారిని ఎంపిక చేశారు.

ఐపఎస్‌లకు పోస్టింగ్‌లు..

(మొదటి పేజీ తరువాయి)

కార్యదర్శిగా బాధ్యతలు అప్పగించారు.

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి. సాయి ప్రసాద్ జారీ చేసిన జీవో నెం.1985 ప్రకారం.. ప్రస్తుతం పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్న ఆమ్రపాలిని యువజన సర్వీసులు, పర్యాటక, సాంస్కృతిక శాఖలో ప్రభుత్వ కార్యదర్శిగా నియమించారు. ఆమె ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా ఉన్న 1992 బ్యాచ్ అధికారి షంషేర్ సింగ్ రావత్‌కు రిపోర్ట్ చేయనున్నారు.ఈ ఉత్తర్వుల ప్రకారం, పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్న 2002 బ్యాచ్ ఐఏఎస్ అధికారి సౌరభ్ గౌర్‌ను న్యూఢిల్లీలోని ఏపీ భవన్‌లో ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ (ఓఎస్‌డీ)గా నియమించారు. 2006 బ్యాచ్ అధికారి డి. మురళీధర్ రెడ్డికి గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శిగా పోస్టింగ్ ఇచ్చారు. దీంతో ఇప్పటివరకు ఆ పోస్టులో పూర్తి అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్న ఎం.ఎం. నాయక్‌కు బాధ్యతల నుంచి ఉపశమనం లభించింది.

మంజులే బాలాజీ దిగంబర్ (2009 బ్యాచ్): ఆర్థికంగా వెనుకబడిన వర్గాల సంక్షేమ శాఖ అదనపు కార్యదర్శి.కె. నీలకంఠ రెడ్డి (2017 బ్యాచ్): యువజన సర్వీసుల డైరెక్టర్. ఈ పోస్టు అదనపు బాధ్యతల నుంచి ఐఎఫ్ఎస్ అధికారిణి ఎస్. భరణిని తప్పించారు.బి. అనిల్ కుమార్ రెడ్డి (2017 బ్యాచ్): పరిశ్రమలు, వాణిజ్య శాఖలో పరిశ్రమలు, ఎంఎస్ఎంఈ విభాగం సంయుక్త కార్యదర్శి.ఎన్. తేజ్ భరత్ (2018 బ్యాచ్): ఏపీ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ కార్యదర్శి.

ఎం. వరప్రసాద్: ఏపీ పౌరసరఫరాల సంస్థ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్. ఈ పోస్టు పూర్తి అదనపు బాధ్యతల నుంచి కె. కన్నబాబుకు విముక్తి లభించింది.గెదెల శ్రీను కుమార్: స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డు శాఖ డిప్యూటీ సెక్రటరీ.ప్రస్తుతం ఉద్యానవన, సెరికల్చర్ డైరెక్టర్‌గా ఉన్న డాక్టర్ కె. శ్రీనివాసులుకు వ్యవసాయ మార్కెటింగ్ డైరెక్టర్‌గా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. అదేవిధంగా, పరిశ్రమల డైరెక్టర్‌గా ఉన్న శుభమ్ బన్సల్‌కు ఏపీ స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్‌గా పూర్తి అదనపు బాధ్యతలు కేటాయించారు. ఈ ఉత్తర్వులు తక్షణమే అమల్లోకి వస్తాయని సాధారణ పరిపాలన శాఖ స్పష్టం చేసింది.

అప్రూవర్‌గా మారండి

(మొదటి పేజీ తరువాయి)

"మీరు చేసిన తప్పును అంగీకరించి అప్రూవర్‌గా మారండి. మీరు ప్రధాన నేరస్థుడు కాదు. మీ వెనుక అసలు సూత్రధారులు ఉన్నారు" అని జ్ఞానేశ్ కుమార్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. సోమవారం సుప్రీంకోర్టు వైపు ప్రతిపక్ష కూటమి చేపట్టిన మార్చ్‌కు ముందు మీడియాతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు.

సీఈసీ సందేశాలు పంపిస్తున్నారు

జ్ఞానేశ్ కుమార్ తనను సంప్రదించారా? సందేశాలు పంపారా? అని ఓ విలేకరి అడగ్గా.. రాహుల్ అవునని సమాధానమిచ్చారు. తాను నిర్వహిస్తున్న మీడియా సమావేశాన్ని కూడా ఆయన చూస్తున్నారని వ్యాఖ్యానించారు. అయితే, తనకు వచ్చిన సందేశాల్లోని వివరాలను మాత్రం వెల్లడించలేదు.

మోదీ, అమిత్ షా ఒత్తిడి ఉందని ఆరోపణ

జ్ఞానేశ్ కుమార్‌పై ప్రభుత్వం రక్షణ కవచంలా నిలుస్తోందని రాహుల్ ఆరోపించారు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్, పారిశ్రామికవేత్త గౌతమ్ అదానీ ఒత్తిడితోనే సీఈసీ వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. ఈ ఆరోపణలకు సంబంధించి ఆయన ఆధారాలను మీడియా ముందు వెల్లడించలేదు.

సుప్రీంకోర్టుకు ప్రతిపక్ష కూటమి

ఎన్నికల సంఘంపై వచ్చిన ఆరోపణలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఇండియా కూటమి సోమవారం సుప్రీంకోర్టు వైపు మార్చ్ చేపట్టింది. ఎన్నికల ప్రక్రియలో అక్రమాలు జరుగుతున్నాయంటూ రాహుల్ గతంలోనూ ఆరోపణలు చేశారు. ఎన్నికల నిర్వహణలో పారదర్శకత దెబ్బతింటోందని విమర్శించారు. సీఈసీని తొలగించాలని, ఎన్నికల వ్యవస్థలో మార్పులు తీసుకురావాలని డిమాండ్ చేశారు.

200 మంది అధికారులు టచ్‌లో

కేంద్ర ప్రభుత్వంలోని సుమారు 200 మంది అధికారులు ప్రతిపక్ష నేతలతో సంప్రదింపులు జరుపుతున్నారని రాహుల్ తెలిపారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ), కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ), విదేశాంగ శాఖకు చెందిన అధికారులు కూడా ఇందులో ఉన్నారని పేర్కొన్నారు. వారే తమకు సమాచారం అందిస్తున్నారని తెలిపారు. అయితే, ఈ వాదనకు సంబంధించిన వివరాలను వెల్లడించలేదు.

రాజ్యాంగ పరిరక్షణకు అందరూ కలిసి రావాలి

కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, తాను ఎన్నికల నిష్పాక్షికతపై ఆందోళన వ్యక్తం చేస్తూ భారత ప్రధాన న్యాయమూర్తికి లేఖ రాశామని రాహుల్ చెప్పారు. పిటిషన్ దాఖలు చేయాలని సీజేఐ సూచించినట్లు తెలిపారు. రాజ్యాంగ పరిరక్షణ కోసం పోరాడే వారికి రాజకీయాలకు అతీతంగా మద్దతిస్తామని స్పష్టం చేశారు.జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించే వరకు తమ ఆందోళన ఆగదని రాహుల్ ప్రకటించారు. ఆ తర్వాత ప్రధాని మోదీ, అమిత్ షాపై కూడా తమ పోరాటం కొనసాగుతుందని వ్యాఖ్యానించారు.

తిరుపతికి మహర్దశ

(మొదటి పేజీ తరువాయి)

అమరావతి సచివాలయం నుంచి వర్చువల్ విధానంలో ఆయన ఈ ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా భక్తులకు సమగ్ర సమాచారం అందించేందుకు రూపొందించిన 'వెంకటాద్రి' యాప్‌ను కూడా సీఎం ఆవిష్కరించారు. ఈ వర్చువల్ కార్యక్రమంలో టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈఓ ఎం. రవిచంద్ర, పాలకమండలి సభ్యులు, తిరుపతి జిల్లా కలెక్టర్, 'తుడా' అధికారులు పాల్గొన్నారు.

భక్తుల సౌకర్యార్థం ఇంటిగ్రేటెడ్ టౌన్‌షిప్

తిరుమలపై రద్దీని తగ్గించి, భక్తులకు ప్రపంచస్థాయి సౌకర్యాలు కల్పించే లక్ష్యంతో అలిపిరి వద్ద భారీ ఇంటిగ్రేటెడ్ పిలిగ్రిమ్ టౌన్‌షిప్ నిర్మాణానికి ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. ఇందులో భాగంగా రూ.1,332 కోట్లతో యాత్రికుల కోసం వసతి సముదాయాలు నిర్మించనున్నారు. నాలుగు బ్లాకుల్లో 2,700 గదులు అందుబాటులోకి రానుండగా, రోజుకు 15 వేల మందికి పైగా భక్తులు బస చేసే వీలుంటుంది.

రూ.160 కోట్లతో నిర్మించే నూతన అన్నప్రసాద కేంద్రంలో ఒకేసారి 6 వేల మంది భక్తులు భోజనం చేయవచ్చు. వీటితో పాటు రూ.486 కోట్లతో నాలుగు పిలిగ్రిమ్ ఎమినిటీస్ కాంప్లెక్స్‌లు నిర్మిస్తారు. వీటిలో ఒకేసారి 16 వేల మంది భక్తులు విశ్రాంతి తీసుకోవచ్చు. రూ.311 కోట్లతో 4,500 వాహనాలు నిలిపేలా బహుళ అంతస్తుల పార్కింగ్ సముదాయం, రూ.90 కోట్లతో 30 బస్ బేలతో కూడిన ఇంటిగ్రేటెడ్ ట్రాన్స్‌పోర్ట్ టెర్మినల్ కూడా ఈ టౌన్‌షిప్‌లో భాగంగా ఉండనున్నాయి.

టీటీడీ ఉద్యోగుల సొంతింటి కల సాకారం

దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న టీటీడీ ఉద్యోగుల సొంతింటి కలను సాకారం చేసే దిశగా ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. 418 ఎకరాల విస్తీర్ణంలో 5,192 మంది టీటీడీ ఉద్యోగులకు ఇళ్ల స్థలాలను కేటాయించే లేఅవుట్ అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపన చేశారు. ఈ లేఅవుట్‌లో అంతర్గత బీటీ రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, విద్యుత్ వంటి మౌలిక వసతుల కల్పనకు రూ.230 కోట్లు వెచ్చించనున్నారు.

మాస్టర్ ప్లాన్ రహదారులతో మారనున్న రూపురేఖలు

తిరుపతి నగరంలో ట్రాఫిక్ సమస్యను అధిగమించేందుకు రూ.242 కోట్ల వ్యయంతో 9 మాస్టర్ ప్లాన్ రహదారుల నిర్మాణ పనులను కూడా సీఎం ప్రారంభించారు. ఈ రహదారుల నిర్మాణం పూర్తయితే నగరంలో రవాణా వ్యవస్థ మరింత మెరుగుపడనుంది. ప్రత్యేకించి తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయానికి మూడు కొత్త మాస్టర్ ప్లాన్ రహదారులను నిర్మించనున్నారు. ఈ సమగ్ర ప్రాజెక్టుల ద్వారా తిరుపతిని ఆధ్యాత్మిక రాజధానిగా మాత్రమే కాకుండా, అత్యుత్తమ మౌలిక వసతులున్న నగరంగా తీర్చిదిద్దాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

ఆసుపత్రుల బిల్లులపై కేంద్రం సీరియస్..

(మొదటి పేజీ తరువాయి)

కేంద్ర పాలిత ప్రాంతాలను ఆదేశించింది. వైద్య సేవల్లో పారదర్శకత, జవాబుదారీతనం పెంచడంతో పాటు రోగులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా ఈ చర్యలు చేపట్టినట్టు కేంద్రం సోమవారం స్పష్టం చేసింది. ఈ మేరకు కేంద్ర ఆరోగ్య శాఖ కార్యదర్శి పుణ్య సలిల శ్రీవాస్తవ అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల ప్రధాన కార్యదర్శులకు లేఖ రాశారు. ఆసుపత్రులలో చార్జీల ప్రదర్శనకు సంబంధించిన నిబంధనలు సక్రమంగా అమలవుతున్నాయో లేదో సమీక్షించాలని, రోగులకు, వారి సహాయకులకు చార్జీల వివరాలు సులభంగా కనిపించేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆమె తన లేఖలో కోరారు. చికిత్స ఖర్చులను పారదర్శకంగా ప్రదర్శించడం వల్ల రోగులు, వారి కుటుంబసభ్యులు వైద్యానికి అయ్యే వ్యయంపై ఒక అంచనాకు రాగలరని, తద్వారా ఆర్థికంగా ముందే ప్రణాళిక వేసుకోవడానికి వీలవుతుందని మంత్రిత్వ శాఖ అభిప్రాయపడింది. ఇది బిల్లింగ్ విషయంలో తలెత్తే వివాదాలను తగ్గించి, వైద్య వ్యవస్థపై ప్రజల్లో నమ్మకాన్ని పెంచుతుందని పేర్కొంది.

క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ (రిజిస్ట్రేషన్ అండ్ రెగ్యులేషన్) యాక్ట్-2010, క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ (సెంట్రల్ గవర్నమెంట్) రూల్స్-2012 ప్రకారం, ఈ చట్టం వర్తించే రాష్ట్రాల్లోని వైద్య సంస్థలు అందించే అన్ని సేవలు, సౌకర్యాల చార్జీలను తప్పనిసరిగా ప్రదర్శించాలి. ఈ వివరాలను ఇంగ్లీషుతో పాటు స్థానిక భాషలో కూడా అందరికీ కనిపించే ప్రదేశంలో ఉంచాలని నిబంధనలు స్పష్టం చేస్తున్నాయి.ఆరోగ్యం రాష్ట్రాల పరిధిలోని అంశం కాబట్టి, ఈ నిబంధనలను క్షేత్రస్థాయిలో అమలు చేయాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాలపైనే ఉందని కేంద్ర ఆరోగ్య కార్యదర్శి గుర్తు చేశారు. కేంద్ర చట్టం వర్తించని రాష్ట్రాలు కూడా తమ సొంత నిబంధనల ప్రకారం చార్జీల ప్రదర్శనను తప్పనిసరి చేయాలని సూచించారు.

ఇదే సమయంలో భారత్‌లో చికిత్స కోసం వచ్చే విదేశీ రోగుల విషయంలోనూ పారదర్శకత పాటించాలని కేంద్రం కోరింది. మెడికల్ లేదా ఆయుష్ వీసాలపై వచ్చే వారికి అందించే ప్యాకేజీ రేట్లను కూడా ప్రముఖంగా ప్రదర్శించేలా ఆసుపత్రులను ప్రోత్సహించాలని రాష్ట్రాలకు విజ్ఞప్తి చేసింది. దీనివల్ల విదేశీ రోగులు సరైన నిర్ణయం తీసుకోవడానికి, ధరల విషయంలో ఫిర్యాదులు తగ్గించడానికి వీలవుతుందని, వైద్య రంగంలో భారత్ స్థానాన్ని మరింత బలోపేతం చేస్తుందని కేంద్రం ఆశాభావం వ్యక్తం చేసింది.

మున్సిపల్ ఎన్నికలకు రిజర్వేషన్లు ఖరారు

(మొదటి పేజీ తరువాయి)

వర్గానికి 35 స్థానాలు, ఎస్సీ (షెడ్యూల్డ్ కులాలు) వర్గానికి 14 స్థానాలు, ఎస్టీ (షెడ్యూల్డ్ తెగలు) వర్గానికి 3 స్థానాలు కేటాయించారు.అన్ని కేటగిరీలలో కలిపి మహిళలకు మొత్తం 50 స్థానాలు రిజర్వ్ చేయడం గమనార్హం. కేటగిరీల వారీగా రిజర్వ్ చేయబడిన పురపాలక సంఘాల పూర్తి వివరాలు కింద ఇవ్వబడ్డాయి.

కేటగిరీల వారీగా పురపాలక సంఘాల జాబితా

ఎస్టీ (షెడ్యూల్డ్ తెగలు) – 3

ఎస్టీ – మహిళ: గూడూరు

ఎస్టీ – జనరల్: ఆత్మకూరు, ఆలూరు

ఎస్సీ (షెడ్యూల్డ్ కులాలు) – 14

ఎస్సీ – మహిళ: కొండపల్లి, నిడదవోలు, యలమంచిలి, చింతలపూడి, సూళ్లూరుపేట, గుత్తి, చీరాల.

ఎస్సీ – జనరల్: ఉయ్యూరు, నూజివీడు, కుప్పం, సామర్లకోట, పిఠాపురం, బాపట్ల, పొదిలి.

బీసీ (వెనుకబడిన తరగతులు) – 35

బీసీ – మహిళ: జంగారెడ్డిగూడెం, నర్సీపట్నం, నాయుడుపేట, చిలకలూరిపేట, ఇచ్ఛాపురం, కొవ్వూరు, పాలకొల్లు, గుంతకల్, గుడివాడ, నందిగామ, ముమ్మిడివరం, మదనపల్లె, నరసరావుపేట, అమలాపురం.బీసీ – జనరల్: కావలి, కదిరి, బి.కొత్తకోట, కందుకూరు, హిందూపురం, ఆత్మకూరు (నెల్లూరు), అద్దంకి, కమలాపురం, నెల్లిమర్ల, మడకశిర, ఆళ్లగడ్డ, గురజాల, దాచేపల్లి, గొల్లప్రోలు, మార్కాపురం, నంద్యాల, బేతంచెర్ల, నందికొట్కూరు, దర్శి, గూడూరు (కర్నూలు), మైదుకూరు, బద్వేల్.

జనరల్ కేటగిరీ (మహిళ)

ఈ కేటగిరీ కింద మొత్తం 27 మున్సిపాలిటీలను మహిళలకు కేటాయించారు.

కనిగిరి, వెంకటగిరి, నరసాపురం, పలాస-కాశీబుగ్గ, పెడన, పలమనేరు, జమ్మలమడుగు, ఆకివీడు, పాలకొండ, పొన్నూరు, భీమవరం, జగ్గయ్యపేట, బుచ్చిరెడ్డిపాళెం, యర్రగుంట్ల, యలమంచిలి, కళ్యాణదుర్గ్, ఆమదాలవలస, పుంగనూరు, మాచర్ల, రాజంపేట, ఆదోని, డోన్, రాజాం, బొబ్బిలి, రేపల్లె, పులివెందుల, ఎమ్మిగనూరు.

అన్‌రిజర్వ్డ్ (జనరల్)

కింది 26 మున్సిపాలిటీలు ఏ రిజర్వేషన్ పరిధిలోకి రాకుండా అన్‌రిజర్వ్డ్‌గా ఉన్నాయి.

పుట్టపర్తి, పెనుకొండ, రాయచోటి, సాలూరు, తాడేపల్లిగూడెం, తణుకు, తెనాలి, రామచంద్రాపురం, సత్తెనపల్లె, శ్రీకాళహస్తి, తుని, పార్వతీపురం, ప్రొద్దుటూరు, పుత్తూరు, మండపేట, నగరి, చీమకుర్తి, తిరువూరు, రాయదుర్గ్, గిద్దలూరు, వినుకొండ, పెద్దాపురం, ధర్మవరం, తాడిపత్రి, పిడుగురాళ్ల.

ఈ అధికారిక ప్రకటన వెలువడటంతో, మున్సిపల్ ఎన్నికలపై నెలకొన్న ఉత్కంఠకు తెరపడింది. త్వరలోనే ఎన్నికల షెడ్యూల్ కూడా వెలువడే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. ఈ రిజర్వేషన్ల ఆధారంగా ప్రధాన రాజకీయ పక్షాలు తమ వ్యూహాలకు పదునుపెట్టడం, బలమైన అభ్యర్థులను నిలబెట్టేందుకు కసరత్తులు ప్రారంభించనున్నాయి. రాబోయే రోజుల్లో పురపాలక రాజకీయాలు మరింత వేడెక్కనున్నాయి.

కార్పొరేషన్లు రిజర్వేషన్ల కేటాయింపు ఇలా :

ఎస్టీ (ఒకటి): మంగళగిరి-తాడేపల్లి

ఎస్సీ (రెండు): రాజమహేంద్రవరం, కర్నూలు

బీసీ – మహిళ (రెండు): మచిలీపట్నం, కాకినాడ

బీసీ – జనరల్ (మూడు): అనంతపురం, చిత్తూరు, ఏలూరు

జనరల్ – మహిళ (ఐదు): విజయనగరం, శ్రీకాకుళం, గుంటూరు, కడప, విశాఖపట్నం

అన్‌రిజర్వ్‌డ్ (నాలుగు): తిరుపతి, విజయవాడ, ఒంగోలు, నెల్లూరు

ఈ తాజా నోటిఫికేషన్‌తో ప్రధాన నగరాలైన విశాఖపట్నం, గుంటూరు మేయర్ పీఠాలు మహిళలకు దక్కనుండగా, విజయవాడ, తిరుపతి వంటి కీలక కార్పొరేషన్లు అన్‌రిజర్వ్‌డ్ కేటగిరీలో ఉన్నాయి. మేయర్ పదవుల రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తికావడంతో, త్వరలోనే ఎన్నికల షెడ్యూల్‌పై స్పష్టత వచ్చే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

పెట్టుబడులకు ఏపి స్వర్గధామం

(మొదటి పేజీ తరువాయి)

ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ, కాకినాడ ప్రాంతంలో రూ.6,347 కోట్ల పెట్టుబడులతో చేపట్టనున్న ప్రాజెక్టుల ద్వారా సుమారు 18 వేల మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. పరిశ్రమలకు అవసరమైన అనుమతులు, ప్రోత్సాహకాలను వేగంగా అందించేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.సింగపూర్ తరహాలో సమష్టి కృషితో రాష్ట్రాన్ని అభివృద్ధి చేయవచ్చని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు ఉన్న 1,053 కిలోమీటర్ల తీర ప్రాంతాన్ని పరిరక్షిస్తూనే పర్యావరణహిత పారిశ్రామిక అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లోనూ పెట్టుబడులు పెట్టి అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పారిశ్రామికవేత్తలను కోరారు.

పల్లెల వైపు పెట్టుబడులు రావాలి

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పల్లెలు, ఏజెన్సీ ప్రాంతాల్లో సౌకర్యాలు పెంపు, మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం ఇస్తోంది. రాష్ట్రంలో పల్లె పండుగ, అడవితల్లి బాట పేరుతో చేస్తున్న కార్యక్రమాలు గ్రామాలు, గిరిజన ఆవాసాలకు సౌకర్యాల కళను తీసుకొస్తున్నాయి. రూ.1.70 లక్షల కోట్లతో పల్లెలు, ఏజెన్సీల్లో ముమ్మరంగా రోడ్లు, డ్రైయిన్లు, అనుసంధాన దారులు, ఇతర సౌకర్యాలను పెంచే కార్యక్రమం చేస్తున్నాం. పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు పల్లెలు, గిరిజన ప్రాంతాల్లో కూడా తమ దృష్టి నిలిపి,



పరిధిని విస్తరించాలని కోరుతున్నాను. దీనిద్వారా అన్ని ప్రాంతాలకు అభివృద్ధి విస్తరించడం సులభం అవుతుంది. తద్వారా గ్రామాలకు కొత్త అవకాశాలను సృష్టించడం సులభం అవుతుంది.

ఆంధ్రప్రదేశ్ లో నూతన పరిశ్రమలకు పెట్టుబడులు పెట్టేముందు పారిశ్రామిక వేత్తలు భూమి గురించో, సౌకర్యాల కల్పన, అనుమతులు గురించో కాదు.. సుస్థిరమైన, సమర్థవంతమైన పాలన చూస్తున్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణ, ప్రభుత్వం మీద నమ్మకంతో వారు పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వస్తున్నారు. ఎక్కడైతే ప్రశాంతమైన పరిస్థితులు, వృద్ధి చెందడానికి అవకాశాలు ఉంటాయో అక్కడ పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు ముందుకు వస్తారు. అలాంటి పరిస్థితి రాష్ట్రంలో ఉంది. గత ప్రభుత్వంలో కొత్త పరిశ్రమలు రాష్ట్రానికి రాకపోగా, ఉన్న పరిశ్రమలు వేరే రాష్ట్రాలకు తరలిపోయాయి. కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో సుస్థిరమైన ప్రగతిని సాధిస్తూ, యువతకు ఉపాధిని చూపుతూ, శాంతిభద్రతల పరిరక్షణకు ప్రథమ ప్రాధాన్యం ఇస్తోంది. పారిశ్రామిక ప్రగతి, పర్యావరణ అభివృద్ధి అనేవి జోడెడ్లుగా ముందుకు సాగితేనే రాష్ట్రం అన్ని విధాలుగా నూతన కళను సంతరించుకుంటుంది.

రాష్ట్రంలోకి ఎంతో ఉత్సాహంతో వస్తున్న పెట్టుబడిదారులకు నేను చెప్పేది ఒకటే. రండి.. ఆంధ్రప్రదేశ్ పునర్నిర్మాణంలో మాతో కలిసి నడవండి.. ప్రజల ఉన్నతి కోసం పనిచేయండి. స్థానిక పెట్టుబడులతో యువతకు ఉపాధి నైపుణ్యాలను కల్పించి ఉద్యోగాలు వస్తాయి. వ్యాపారులకు వ్యాపారం జరుగుతుంది. గ్రామీణులు, మత్స్యకారులతోనూ పనిచేసే అవకాశం ఉంటుంది. పెట్టుబడులు పెడుతున్న మొదటిరోజు నుంచే పర్యావరణ హితమైన పారిశ్రామిక అభివృద్ధి అనే కోణంలోనే ముందుడుగు వేయండి. ఆంధ్రప్రదేశ్ లో ప్రతి రంగం అభివృద్ధి చెందేలా, ప్రతి వర్గం ఉన్నతి సాధించేలా ఓ సమగ్ర ప్రణాళికతో ముందుకు వెళున్నాం. దీనిలో భాగస్వామ్యం అవుతున్న ప్రతి ఒక్కరికీ నా హృదయ పూర్వక ధన్యవాదాలు" అన్నారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు శ్రీ టీజీ భరత్, శ్రీ బీసీ జనార్ధన్ రెడ్డి, శ్రీ కందుల దుర్గేష్, ఎంపీలు శ్రీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, శ్రీ హరీష్ మాధుర్, శ్రీ సానా సతీష్ బాబు, సీఐఐ ఆంధ్రప్రదేశ్ వైస్ ఛైర్మన్ శ్రీ సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు

ఘోర ప్రమాదం

(మొదటి పేజీ తరువాయి)

పోలీసులు అందించిన ప్రాథమిక సమాచారం ప్రకారం, మృతులను నున్న, నంబూరు ప్రాంత వాసులుగా గుర్తించారు. వీరంతా నంబూరులో జరిగిన ఒక ఫంక్షన్‌కు హాజరై తిరిగి తమ ఇళ్లకు పయనమవుతుండగా ఈ విషాదం జరిగింది. వేగంగా ప్రయాణిస్తున్న కారు అదుపుతప్పి ప్రమాదానికి గురై ఉండవచ్చని అధికారులు భావిస్తున్నారు. ప్రమాదం జరిగిన వెంటనే కారులో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో లోపల ఉన్నవారు బయటకు వచ్చే అవకాశం లేకుండా పోయింది.

సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. తీవ్రంగా గాయపడిన వ్యక్తిని హుటాహుటిన సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయనకు వైద్యులు చికిత్స అందిస్తున్నారు. ప్రమాద వార్త తెలియగానే మృతుల బంధువులు సంఘటనా స్థలానికి చేరుకుని కన్నీరుమున్నీరుగా విలపించారు. వారి ఆక్రందనలతో ఆ ప్రాంతంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

ఈడీ, సీబీఐ సరిపోక ఈసీని వాడుకుంటున్నారు

(మొదటి పేజీ తరువాయి)

ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు.

ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ (రూ×=) ప్రక్రియను అడ్డం పెట్టుకుని బీజేపీకి వ్యతిరేకంగా ఉన్నవారి ఓట్లను తొలగించే బాధ్యతను చీఫ్ ఎలక్షన్ కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌కు అప్పగించారని రేవంత్ రెడ్డి ఆరోపించారు. 1950లో ప్రజలకు ఓటు హక్కు కల్పించడానికి తీసుకొచ్చిన ఈ ప్రక్రియను, ఇప్పుడు బీజేపీ తన వ్యతిరేకుల ఓట్లను తొలగించడానికి వాడుకుంటోందని విమర్శించారు. ఈ చర్యల ద్వారా.. బీజేపీని వ్యతిరేకించే యువత, నిరుద్యోగులు, పేదలను లక్ష్యంగా చేసుకున్నారని ఆయన పేర్కొన్నారు.

ఈసీలోని మిగతా ఇద్దరు కమిషనర్లు ఎస్ఐఆర్ ప్రక్రియలోని లోపాలను వ్యతిరేకించారని, దీనివల్ల జ్ఞానేశ్ కుమార్ ఏకపక్ష నిర్ణయాలు బయటపడ్డాయని రేవంత్ రెడ్డి తెలిపారు. అలాంటి అధికారిని తొలగించడానికి ప్రధాని నరేంద్ర మోదీకి అభ్యంతరం ఎందుకని ఆయన ప్రశ్నించారు. బీజేపీ మత, ప్రాంతీయ ప్రాతిపదికన ప్రజలను విభజించి, ధనవంతులు-బీజేపీ మద్దతుదారులు ఒకవైపు, పేదలు-గిరిజనులు-బీజేపీ వ్యతిరేకులు మరోవైపు అనేలా రెండు వర్గాలుగా చూస్తోందని ఆరోపించారు.

ఈ పరిస్థితిని మరో స్వాతంత్ర్య సంగ్రామంగా అభివర్ణించిన రేవంత్, రాహుల్ గాంధీ చేపట్టిన 'జ్ఞానేశ్ కుమార్ గో బ్యాక్' ఉద్యమం దేశాన్ని కాపాడుతుందని అన్నారు. గతంలో జ్ఞానేశ్ కుమార్ నియామకాన్ని రాహుల్ గాంధీ వ్యతిరేకించిన విషయాన్ని కూడా ఆయన ఈ సందర్భంగా గుర్తుచేశారు.

చిన్నటేకూరులో కల్లూరు మండల సమాఖ్య భవనానికి స్థలం కేటాయింపు

శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే.. త్వరలోనే భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయిస్తాం





కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ అక్టోబర్ 12)

కల్లూరు మండల సమాఖ్య భవన నిర్మాణానికి చిన్నటేకూరు గ్రామంలో స్థలం కేటాయించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి శిలాఫలకాన్ని ఆవిష్కరించి, సమావేశంలో పాల్గొన్నారు. మండల సమాఖ్య భవన నిర్మాణానికి త్వరలోనే అనుమతులు, నిధులు మంజూరయ్యేలా కృషి చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కల్లూరు మండలంలోని 37 గ్రామ సంఘాల అభ్యున్నతి, మహిళల సాధికారతే లక్ష్యంగా మండల సమాఖ్య భవనాన్ని నిర్మించనున్నట్లు తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల



ప్రజలకు, పొదుపు మహిళలకు అందుబాటులో ఉండేలా చిన్నటేకూరు గ్రామాన్ని స్థలంగా ఎంపిక చేసినట్లు వివరించారు. భవన నిర్మాణాన్ని త్వరితగతిన చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రావు, స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ కే. వేణుగోపాల్‌రావు, మండల తహసీల్దార్ ఆంజనేయులు, ఎంపీడీవో శ్రీనివాసులు, పీఆర్ ఏఈ రవిచంద్రారెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, అర్బన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ రామాంజనేయులు, విశ్వకర్మ చైర్మన్ పార్వతి, సింగిల్ విండో అధ్యక్షుడు రమణ, పర్ల శేఖరన్న, సత్యనారాయణమ్మ, చిన్నటేకూరు గ్రామ పెద్దలు టి. రామాంజినేయులు, కి. శేషగిరి, బజారప్ప, లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.

అలాగే జిల్లా సమాఖ్య, మండల సమాఖ్య అధ్యక్షురాలు జుబేదా బి., డీఆర్‌డీఏ వెలుగు ఏపీఎం భోగాపుష్పవతి, సీసీలు, వివిధ గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో హాజరైన పొదుపు మహిళలు, వీవోఏలు, గ్రామ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ప్రజల ఓటు హక్కుపై దాడి అప్రజాస్వామికం

కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలి

ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి శాలెం రాజు మాదిగ డిమాండ్

కర్నూలులో అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన.. కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం







కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ అక్టోబర్ 12)

ప్రజల ఓటు హక్కును హరించడం అప్రజాస్వామికమని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి శాలెం రాజు మాదిగ అన్నారు. ఓట్ల తొలగింపునకు బాధ్యత వహిస్తూ భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) వ్యవస్థాపక అధ్యక్షుడు ఉసురుపాటి బ్రహ్మయ్య మాదిగ ఆదేశాల మేరకు కర్నూలు నగరంలోని పాత బస్టాండ్ వద్ద డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించారు.ఎమ్మార్పీఎస్ కర్నూలు జిల్లా కన్వీనర్ గంజహళ్లి పసెద్దుల మహదేవ్ మాదిగ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి శాలెం రాజు మాదిగ, జాతీయ ప్రధాన కార్యదర్శి రాం కొండ వెంకటేశ్వర్లు మాదిగ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. తొలుత అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎన్నికల వ్యవస్థలో జరుగుతున్న పరిణామాలను నిరసిస్తూ ఆందోళన చేపట్టారు.ఈ సందర్భంగా శాలెం రాజు మాదిగ మాట్లాడుతూ, స్వతంత్రంగా పనిచేయాల్సిన ఎన్నికల సంఘాన్ని కేంద్ర ప్రభుత్వం తనకు అనుకూలమైన సంస్థగా మార్చుకుందని ఆరోపించారు.

స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) పేరుతో 13 కోట్ల మందికి పైగా ఓటర్లను తొలగించారని విమర్శించారు. ఇది పౌరుల ప్రాథమిక ఓటు హక్కుపై దాడి చేయడమేనని పేర్కొన్నారు. ఎన్నికల సంఘం పనితీరుపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకోవడానికి ప్రతి భారతీయ పౌరుడు ముందుకు రావాలని పిలుపునిచ్చారు.జ్ఞానేశ్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలని, ఎన్నికల వ్యవస్థలో సమగ్ర సంస్కరణలు చేపట్టాలని, ఎస్ఐఆర్ ప్రక్రియలో తొలగించబడ్డాయని తాము ఆరోపిస్తున్న ఓటర్ల పేర్లను తిరిగి ఓటరు జాబితాలో చేర్చాలని డిమాండ్ చేశారు.అనంతరం ఎమ్మార్పీఎస్ నాయకులు కలెక్టరేట్ ఎదుట గాంధీ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో జిల్లా జాయింట్ కలెక్టర్‌కు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బురుజుల పులికొండ మాదిగ, రాష్ట్ర కార్యదర్శి జి. ఆనంద్ చైతన్య మాదిగ, నంద్యాల జిల్లా కన్వీనర్ కె. రాజు మాదిగ, కర్నూలు జిల్లా ప్రధాన కార్యదర్శి చెన్నంపల్లి కె. శ్రీనివాసులు మాదిగ, జిల్లా నాయకులు చందోలి ఎం. ప్రసాద్ మాదిగ, డోన్ రామాంజనేయులు మాదిగ, నాగరాజు మాదిగ, దేవనకొండ రామాంజనేయులు మాదిగ, గంజహళ్లి గిద్యోను మాదిగ, హెచ్. కైరవాడి నాగరాజు మాదిగ, గుల్లమరుసు ఇమ్మానియేలు మాదిగ, పెద్ద మర్రివీడు రాజు మాదిగ, గాజులదిన్నె హరిబాబు మాదిగ, సంసోను మాదిగ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం సహించం!

అర్జీదారులకు సంతృప్తికరమైన పరిష్కారాలు అందించాలి -అధికారులకు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి ఆదేశం

లీ ఓపెన్, అసమర్థ పరిష్కారాల కేసులను తగ్గించాలి స్థానిక సంస్థల ఎన్నికల విధులపై అధికారులకు పూర్తి అవగాహన ఉండాలి





కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ అక్టోబర్ 12)

ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యానికి తావులేకుండా, అర్జీదారులు సంతృప్తి చెందేలా నాణ్యమైన పరిష్కారాలు అందించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి అధికారులను ఆదేశించారు. ప్రజల నుంచి అందే ప్రతి ఫిర్యాదును బాధ్యతాయుతంగా పరిశీలించి, నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని స్పష్టం చేశారు.కర్నూలు కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో కలెక్టర్ ప్రజల నుంచి వివిధ సమస్యలకు సంబంధించిన వినతులను స్వీకరించారు. వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు.

అర్జీల పరిష్కారంలో జాప్యం వద్దు

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం ప్రభుత్వ యంత్రాంగం ప్రధాన బాధ్యత అని పేర్కొన్నారు. పీజీఆర్ఎస్‌లో నమోదయ్యే ప్రతి అర్జీకి అత్యంత ప్రాధాన్యతనిస్తూ, సమస్య స్వభావాన్ని క్షుణ్ణంగా పరిశీలించి సమర్థవంతంగా పరిష్కరించాలని సూచించారు. అర్జీల పరిష్కారంలో జాప్యం చేయకుండా, ఫిర్యాదుదారులకు స్పష్టమైన సమాధానం ఇవ్వాలని ఆదేశించారు.అర్జీదారులకు అందించే పరిష్కార నివేదికలు స్పష్టంగా, సులభంగా అర్థమయ్యే విధంగా ఉండాలని తెలిపారు. ఫిర్యాదు అందిన వెంటనే సంబంధిత అధికారి అర్జీదారుతో స్వయంగా మాట్లాడి సమస్య వివరాలను తెలుసుకోవాలన్నారు. అవసరమైన సందర్భాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి, వాస్తవ పరిస్థితులను పరిశీలించిన అనంతరం సమస్య పరిష్కారానికి తగిన చర్యలు చేపట్టాలని సూచించారు.పీజీఆర్ఎస్‌లో పరిష్కరించినట్లు నమోదైనప్పటికీ, సంతృప్తికరమైన పరిష్కారం లభించక మళ్లీ తెరపైకి వస్తున్న 'రీ ఓపెన్' కేసులు, సక్రమంగా పరిష్కరించని ఫిర్యాదులకు సంబంధించిన 'ఇంప్రాపర్ రెడ్రెసల్' కేసుల సంఖ్యను గణనీయంగా తగ్గించాలని అధికారులను ఆదేశించారు. కేవలం అర్జీలను పరిష్కరించినట్లు నమోదు చేయడం కాకుండా, ఫిర్యాదుదారులకు వాస్తవంగా న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

ఎన్నికల విధులపై పూర్తి అవగాహన అవసరం

త్వరలో నిర్వహించనున్న స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి అధికారులు తమ విధులు, బాధ్యతలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ సూచించారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించిన మార్గదర్శకాలు, నిబంధనలు, మాన్యువల్స్‌ను క్షుణ్ణంగా అధ్యయనం చేయాలని ఆదేశించారు.

ఎన్నికల విధుల నిర్వహణ, సిబ్బంది కేటాయింపు, శిక్షణ, పోస్టల్ బ్యాలెట్ తదితర అంశాలపై స్పష్టత కలిగి ఉండాలన్నారు. ప్రతి అంశానికి నియమించిన నోడల్ అధికారులు తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ, ఎన్నికల ప్రక్రియ సజావుగా జరిగేలా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. ఎన్నికల నిర్వహణలో ఎలాంటి పొరపాట్లకు అవకాశం లేకుండా నిబంధనలకు అనుగుణంగా పనిచేయాలని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్, జిల్లా రెవెన్యూ అధికారి వెంకటనారాయణమ్మ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు అనురాధ, రామసుబ్బయ్య, శివప్రసాద్ రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి క్షేత్రస్థాయి పరిశీలన అవసరం

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 18 అర్జీలు

కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ అక్టోబర్ 12)



నగర ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, వాటికి సత్వర పరిష్కారం చూపేందుకు అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు సూచించారు. ప్రజలతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకోవడం ద్వారా వాస్తవ పరిస్థితులను అర్థం చేసుకుని, సమర్థవంతమైన పరిష్కార చర్యలు చేపట్టవచ్చని పేర్కొన్నారు.

స్థానిక ఎస్‌బీఐ ఎంప్లాయీస్ కాలనీలోని నగరపాలక సంస్థ సమావేశ భవనంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో మొత్తం 18 అర్జీలను అధికారులు స్వీకరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, ప్రజల నుంచి అందిన ప్రతి ఫిర్యాదును ప్రాధాన్యతతో పరిశీలించి, నిబంధనల మేరకు సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు.

అర్జీలపై క్షుణ్ణంగా విచారణ జరిపి, సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, క్షేత్రస్థాయి పరిశీలన ద్వారా సమస్యల మూలాలను గుర్తించి పరిష్కారం చూపాలని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ ఆర్.జి.వి. కృష్ణ, డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి, ఎస్ఈ రమణమూర్తి, ప్రజారోగ్య అధికారి డాక్టర్ ఎం. రఘు, డీసీపీ శబ్నం శాస్త్రీ, ఏసీపీ నాగరాజు, మేనేజర్ జునైద్, ఆర్వోలు క్రిస్టోఫర్, వాజిద్ తదితర అధికారులు పాల్గొన్నారు.

అవుకు ఆదర్శ పాఠశాలలో ఓపెన్ టెన్త్, ఇంటర్ ప్రవేశాలు ప్రారంభం

అవుకు అక్టోబర్ 12 రిపబ్లిక్ న్యూస్



అవుకు ఆదర్శ పాఠశాలలో ఓపెన్ టెన్త్, ఇంటర్మీడియట్ ప్రవేశాలు ప్రారంభమైనట్లు పాఠశాల ప్రిన్సిపల్ హేమీమా తెలిపారు. చదువును మధ్యలో ఆపేసిన యువతీ యువకులు, ఉద్యోగులు, గృహిణులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ విద్యాభ్యాసాన్ని కొనసాగించాలని ఆమె కోరారు. విద్యకు దూరమైన వారు తిరిగి చదువుకునేందుకు ఓపెన్ స్కూల్ మంచి అవకాశమని పేర్కొన్నారు.ప్రవేశాలకు సంబంధించిన పూర్తి వివరాల కోసం 8179758865, 9000206501 నంబర్లను సంప్రదించాలని ప్రిన్సిపల్ హేమీమా సూచించారు

ఎనిమిదేళ్లుగా పెండింగ్‌లో దూదేకుల భూముల సమస్యలు.. తక్షణమే పరిష్కరించాలి!

సాగు భూములను ఆన్‌లైన్‌లో నమోదు చేసి పట్టాదారు పాసుపుస్తకాలు మంజూరు చేయాలి.. జిల్లా కలెక్టర్‌కు దూదేకుల (నూర్ బాషా) కుల సంక్షేమ సంఘం విజ్ఞప్తి!

మా దూజేకుల కులములో చాలామంది నిరుపేదలు ఉన్నారు వారిని గుర్తించి పట్టాదారు పాస్ పుస్తకాలు ఇవ్వాలి



కర్నూలు ప్రతినిధి, అక్టోబర్ 12 (రిపబ్లిక్ న్యూస్):కర్నూలు జిల్లా వెల్దుర్తి మండలంలోని దూదేకుల (నూర్ బాషా) కులస్తుల భూముల సమస్యలను తక్షణమే పరిష్కరించి, అర్హులైన రైతులకు న్యాయం చేయాలని దూదేకుల (నూర్ బాషా) కుల సంక్షేమ సంఘం మండల అధ్యక్షులు జిల్లా కలెక్టర్‌ను కోరారు. సుమారు ఎనిమిదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న భూముల సమస్యలతో పలువురు రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.మండలంలోని పలువురు దూదేకుల కులస్తులు తమ భూములను సాగు చేసుకుంటున్నప్పటికీ, ఆయా భూములు ఆన్‌లైన్ రెవెన్యూ రికార్డుల్లో నమోదు కాకపోవడంతో ప్రభుత్వ పథకాలు, రైతులకు అందాల్సిన ప్రయోజనాలను పొందడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న భూములను సంబంధిత అధికారులు పరిశీలించి, అర్హులైన రైతుల పేర్లపై ఆన్‌లైన్‌లో నమోదు చేయడంతో పాటు పట్టాదారు పాసుపుస్తకాలు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.అలాగే, అర్హులైన దూదేకుల రైతులకు రైతు రుణాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ఇతర ప్రయోజనాలు అందేలా సంబంధిత శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. భూముల సమస్యల పరిష్కారం కోసం రైతులు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకుని రెవెన్యూ అధికారులతో సమగ్ర విచారణ జరిపించి, పెండింగ్ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.ఎనిమిదేళ్లుగా కొనసాగుతున్న భూముల సమస్యలకు ముగింపు పలికి, అర్హులైన రైతులకు న్యాయం చేయాలని దూదేకుల (నూర్ బాషా) కుల సంక్షేమ సంఘం, వెల్దుర్తి మండల అధ్యక్షులు తెలిపారు మా భూములు మాకు ఇవ్వాలి

స్థానిక సంస్థల ఎన్నికలకు సమరశంఖం పూరించండి..

వైసీపీ శ్రేణులకు కాటసాని పిలుపు!

పార్టీ కోసం కష్టపడే ప్రతి కార్యకర్తకు గుర్తింపు, గౌరవం..

41వ వార్డులో పార్టీ గుర్తింపు కార్డుల పంపిణీ



కల్లూరు ప్రతినిధి, అక్టోబర్ 12 (రిపబ్లిక్ న్యూస్):రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇప్పటి నుంచే ఎన్నికల సమరానికి సిద్ధం కావాలని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షులు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రామభూపాల్ రెడ్డి పిలుపునిచ్చారు. పార్టీ బలోపేతానికి ప్రతి నాయకుడు, కార్యకర్త సమష్టిగా కృషి చేయాలని, ప్రజల్లో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.ఈ సందర్భంగా పార్టీ కోసం నిరంతరం కష్టపడుతున్న నాయకులు, కార్యకర్తలకు తగిన గుర్తింపు, గౌరవం కల్పించాలనే ఉద్దేశంతో పార్టీ గుర్తింపు కార్డులను కాటసాని రామభూపాల్ రెడ్డి పంపిణీ చేశారు. పార్టీ కష్టకాలంలో అండగా నిలిచిన కార్యకర్తలను ఎప్పటికీ మరచిపోమని, పార్టీ పట్ల నిబద్ధతతో పనిచేసే ప్రతి ఒక్కరికీ తగిన ప్రాధాన్యత ఉంటుందని పేర్కొన్నారు. కార్యకర్తలే పార్టీకి బలమని, వారి సేవలను గుర్తించి గౌరవించడం పార్టీ బాధ్యత అని స్పష్టం చేశారు.రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ విజయానికి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని, ప్రజలతో మమేకమై పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో 41వ వార్డు మాజీ కార్పొరేటర్ గాజుల శ్వేత రెడ్డి, వార్డు నాయకులు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No:/2023/87888

ఆడపిల్లలను కాపాడుదాం..
సమాన అవకాశాలు కల్పిద్దాం

లింగ వివక్షను రూపుమాపి సమానత్వంతో కూడిన సమాజ నిర్మాణానికి కృషి చేయాలి -ఆడపిల్లల రక్షణ, లింగ సమానత్వంపై విస్తృత అవగాహన కల్పించాలి

అంతర్జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా లఘుచిత్ర పోటీల విజేతలకు నగదు బహుమతులు అందజేసిన జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా




నంద్యాల బ్యూరో, అక్టోబర్ 12 (రిపబ్లిక్ న్యూస్)
మహిళల ప్రతిభను గుర్తించి, అన్ని రంగాల్లో వారికి సమాన అవకాశాలు కల్పించడం ద్వారా సమానత్వంతో కూడిన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి పిలుపునిచ్చారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల విద్యార్థులకు నిర్వహించిన లఘుచిత్ర పోటీల్లో విజేతలుగా నిలిచిన కళాశాలలకు జిల్లా కలెక్టర్ నగదు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ...ఆడపిల్లల రక్షణ, మహిళా సాధికారత, లింగ సమానత్వంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. మహిళలు విద్య, వైద్యం, విజ్ఞానం, క్రీడలు, పరిపాలన సహా అన్ని రంగాల్లో పురుషులతో సమానంగా ప్రతిభ కనబరుస్తూ సమాజ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. మహిళల సామర్థ్యాలను గుర్తించి, వారి అభ్యున్నతికి అవసరమైన అవకాశాలను కల్పించడం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని స్పష్టం చేశారు. ఆడపిల్లల పట్ల వివక్ష చూపడం, గర్భస్థ శిశువు ఆడపిల్ల అని నిర్ధారించుకుని గర్భస్రావానికి పాల్పడటం చట్టవిరుద్ధమని కలెక్టర్ తెలిపారు. ప్రతి శిశువుకు జీవించే హక్కు కల్పించడం, ఆడపిల్లల హక్కులను పరిరక్షించడం, భ్రూణ హత్యలను అరికట్టడం సామాజిక బాధ్యతగా గుర్తించాలని సూచించారు. గర్భస్థ శిశువు లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించడం, లింగ నిర్ధారణ ఆధారంగా గర్భస్రావానికి పాల్పడటం వంటి చర్యలను నిరోధించేందుకు ప్రభుత్వం గర్భధారణ పూర్వ మరియు గర్భధారణ సమయంలో రోగనిర్ధారణ సాంకేతికతల (లింగ ఎంపిక నిషేధ) చట్టం-1994 (పిసి పిఎన్డిటి ఆక్ట్) అమలు చేస్తోందని వివరించారు. ఈ చట్టాన్ని ఉల్లంఘించే వారిపై నిబంధనల ప్రకారం కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. స్త్రీల ప్రాధాన్యత, బాలికల రక్షణ, లింగ సమానత్వం, భ్రూణ హత్యల నివారణ వంటి సామాజిక అంశాలపై ప్రజల్లో చైతన్యం తీసుకురావడానికి లఘుచిత్రాలు, ఇతర ప్రసార మాధ్యమాలను సమర్థవంతంగా వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు. సమాజంలో తరతరాలుగా కొనసాగుతున్న లింగ వివక్షను తొలగించి, బాలికలకు విద్య, ఆరోగ్యం, అభివృద్ధి, సాధికారత రంగాల్లో సమాన హక్కులు, అవకాశాలు కల్పించే దిశగా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు.

లఘుచిత్ర పోటీల్లో నంద్యాల జిల్లా కళాశాలల ప్రతిభ
అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల విద్యార్థుల మధ్య నిర్వహించిన లఘుచిత్ర పోటీల్లో నంద్యాల జిల్లాకు చెందిన కళాశాలల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. మొత్తం ఆరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు పాల్గొన్న ఈ పోటీల్లో ఉత్తమ లఘుచిత్రాలను రూపొందించిన మూడు కళాశాలలు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను కైవసం చేసుకున్నాయి.
ప్రథమ బహుమతి - రూ.30,000: పి.ఎస్.సి. మరియు కె.వి.ఎస్.సి. ప్రభుత్వ డిగ్రీ కళాశాల, నంద్యాల.
ద్వితీయ బహుమతి - రూ.20,000: ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఆళ్లగడ్డ.
తృతీయ బహుమతి - రూ.10,000: ఎస్.జి.టి.ఆర్.యం. ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఎర్రగుంట్ల.
విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీయడంతో పాటు, బాలికల హక్కులు, రక్షణ, సంక్షేమం, సమానత్వం వంటి అంశాలపై సామాజిక చైతన్యం పెంపొందించడంలో ఇటువంటి పోటీలు దోహదపడతాయని కలెక్టర్ పేర్కొన్నారు. లఘుచిత్రాల ద్వారా విద్యార్థులు తమ ఆలోచనలను, సామాజిక సందేశాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం అభినందనీయమన్నారు. పోటీల్లో విజేతలుగా నిలిచిన కళాశాలల విద్యార్థులను జిల్లా కలెక్టర్ అభినందించి, భవిష్యత్తులోనూ సామాజిక బాధ్యతతో కూడిన సృజనాత్మక కార్యక్రమాల్లో పాల్గొనాలని ఆకాంక్షించారు.

పేదరికం చదువుకు అడ్డంకి కాకూడదు

అనాథగా మారిన విద్యార్థిని ఉన్నత విద్యకు కలెక్టర్ భరోసా -జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి





నంద్యాల బ్యూరో, అక్టోబర్ 12 (రిపబ్లిక్ న్యూస్)గత సంవత్సరం చాగలమర్రి మండలం చిన్నగొంగలి గ్రామంలో వర్షాల కారణంగా మట్టిమిద్దె కూలిన ఘటనలో కుటుంబ సభ్యులను కోల్పోయిన ఇంటర్మీడియట్ విద్యార్థిని గురులక్ష్మి ప్రసన్నకు జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి గణియా అండగా నిలిచారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్లో నిర్వహించిన ప్రజా పరిష్కార వేదికలో విద్యార్థినితో మాట్లాడి, ఆమె ఉన్నత విద్యాభ్యాసానికి అవసరమైన సహకారం అందిస్తామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, కుటుంబాన్ని కోల్పోయినప్పటికీ ధైర్యంగా చదువును కొనసాగిస్తూ ఇంటర్మీడియట్‌లో మంచి మార్కులు సాధించిన విద్యార్థినిని అభినందించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే బాధిత కుటుంబానికి రూ.10 లక్షల పరిహారం అందించడంతో పాటు, విద్యార్థిని భవిష్యత్తు కోసం రూ.2 లక్షలను ఆమె అమ్మమ్మకు అందించిందని తెలిపారు. ప్రస్తుతం ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థినికి కళాశాల ఫీజు చెల్లించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. పేదరికం లేదా ప్రతికూల పరిస్థితులు విద్యకు అడ్డంకులు కాకూడదని, పట్టుదలతో లక్ష్యాలను సాధించాలని విద్యార్థినికి సూచించారు. ఆమె విద్యాభ్యాసం నిరాటంకంగా కొనసాగేందుకు జిల్లా యంత్రాంగం అవసరమైన సహకారం అందిస్తుందని కలెక్టర్ స్పష్టం చేశారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి రాము నాయక్, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

బైక్ దొంగల ముఠా గుట్టురట్టు

ఆరుగురు పట్టివేత.. 10 బైక్‌లు స్వాధీనం





రిపబ్లిక్ న్యూస్ నంద్యాల క్రైం, అక్టోబర్ 12: నంద్యాల జిల్లాలో మోటార్ సైకిళ్ల దొంగతనాలకు పాల్పడుతున్న ముఠాను గోస్పాడు పోలీసులు పట్టుకున్నారు. ఐదుగురు నిందితులను అరెస్టు చేయగా, ఒక బాల నేరస్తుడిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.6 లక్షల విలువైన 10 మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు.గోస్పాడు ఎస్ఐ పి. సుధాకర్ రెడ్డి తన సిబ్బందితో కలిసి తెల్లపూరి గ్రామ సమీపంలోని కుందూ నది వంతెన వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా నిందితులు పట్టుబడ్డారు. రాత్రివేళల్లో ఇళ్ల ముందు, షెడ్లలో నిలిపిన మోటార్ సైకిళ్లను మారుతాళాలతో తెరిచి దొంగిలించి, నంబరు పలకలు తొలగించి విక్రయించేందుకు ప్రయత్నించినట్లు విచారణలో వెల్లడైంది.నిందితుల్లో కొందరిపై గతంలోనూ దొంగతనం కేసులు నమోదయ్యాయి. అరెస్టు చేసిన ఐదుగురిని న్యాయస్థానంలో హాజరుపరచనున్నారు. బాల నేరస్తుడి వివరాలను చట్ట ప్రకారం గోప్యంగా ఉంచారు.ఈ కేసును ఛేదించడంలో చురుకుగా పనిచేసిన గోస్పాడు ఎస్ఐ పి. సుధాకర్ రెడ్డి, హెడ్ కానిస్టేబుల్ 2813, పోలీసు కానిస్టేబుళ్లు 1337, 3224, 3256, హోంగార్డు 310లను ఉన్నతాధికారులు అభినందించారు.వాహనదారులు అదనపు తాళాలు వేసుకుని వాహనాలను సురక్షిత ప్రదేశాల్లో నిలిపి ఉంచాలని, నంబరు పలకలు లేని వాహనాల విక్రయాలపై అనుమానం వస్తే పోలీసులకు లేదా డయల్ 112కు సమాచారం ఇవ్వాలని పోలీసులు సూచించారు.

ప్రజా సమస్యలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలి

పీజీఆర్ఎస్‌కు 276 దరఖాస్తులు.. రెవెన్యూ క్లినిక్‌ల ద్వారా 148 అర్జీల స్వీకరణ -జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా







నంద్యాల బ్యూరో, అక్టోబర్ 12 (రిపబ్లిక్ న్యూస్)
ప్రజా సమస్యల పరిష్కారంలో ఎలాంటి జాప్యం లేకుండా, ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్లో నిర్వహించిన ప్రజా పరిష్కార వేదికలో ప్రజల నుంచి 276 దరఖాస్తులను స్వీకరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పెండింగ్ దరఖాస్తులు నిర్దేశిత గడువు దాటకుండా ఎప్పటికప్పుడు పరిశీలించి పరిష్కరించాలని సూచించారు. ముఖ్యంగా పునఃప్రారంభించిన (రీ-ఓపెన్) అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించి, అర్జీదారులతో నేరుగా మాట్లాడి సమస్యల మూలాలను గుర్తించి, నాణ్యమైన పరిష్కారం అందించాలని ఆదేశించారు.

రెవెన్యూ క్లినిక్‌ల ద్వారా 148 అర్జీల స్వీకరణ
భూ సమస్యల పరిష్కారానికి ఏర్పాటు చేసిన రెవెన్యూ క్లినిక్‌లను సమర్థవంతంగా నిర్వహిస్తూ, క్షేత్రస్థాయిలో పరిశీలన ద్వారా అర్జీదారులకు సత్వర న్యాయం అందించాలని కలెక్టర్ సూచించారు. ఈ క్లినిక్‌ల ద్వారా మొత్తం 148 అర్జీలు స్వీకరించగా, అసైన్డ్ భూములు, భూ ఆక్రమణలకు సంబంధించి 58, రెవెన్యూ కోర్టు విచారణలు, ఆర్ఓఆర్‌కు సంబంధించి 35, సర్వే, రీ-సర్వేలకు సంబంధించి 15, చుక్కల భూములు, 22-ఎ భూములు, క్రమబద్ధీకరణకు సంబంధించి 14, దేవాదాయ, వక్ఫ్ భూములకు సంబంధించి 14, అడంగల్ సవరణలకు సంబంధించి 8, రెవెన్యూ, గ్రామ/వార్డు సచివాలయ సేవలకు సంబంధించి 4 దరఖాస్తులు ఉన్నట్లు వివరించారు.

పీజీఆర్ఎస్‌లో ప్రజలు ప్రస్తావించిన సమస్యలు
నంద్యాల పట్టణంలోని పొన్నాపురం కాలనీ 80 అడుగుల రహదారిలో సిమెంట్ రోడ్డు, మున్సిపల్ పైప్‌లైన్ సౌకర్యాలు కల్పించాలని, ఆత్మకూరు మండలానికి చెందిన టి. శ్రీనివాసరెడ్డి తనకు ఇంటి స్థలం మంజూరు చేయాలని, రుద్రవరం మండలం డి. కొట్టాల గ్రామానికి చెందిన వెంకటరమణకు రెండేళ్లుగా రైతు భరోసా నిధులు జమ కానందున సమస్యను పరిష్కరించాలని కోరుతూ అర్జీలు సమర్పించారు. సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి నిబంధనల మేరకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి రాము నాయక్, పీజీఆర్ఎస్ నోడల్ అధికారి ఉమామహేశ్వరి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ప్రజా ఫిర్యాదులపై ఎస్పీ స్పందన

120 ఫిర్యాదులు స్వీకరణ.. సత్వర పరిష్కారానికి ఆదేశాలు





నంద్యాల క్రైం, అక్టోబర్ 12, (రిపబ్లిక్ న్యూస్) నంద్యాల జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ 120 ఫిర్యాదులను స్వీకరించారు. ఫిర్యాదుదారులతో స్వయంగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు.ఫిర్యాదులపై పూర్తిస్థాయి విచారణ జరిపి చట్ట పరిధిలో న్యాయం చేస్తామని ఎస్పీ సునీల్ షోరాణ్ భరోసా ఇచ్చారు. నిర్ణీత గడువులోగా ఫిర్యాదులను పరిష్కరించాలని, అలసత్వం వహించరాదని, సమస్యలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

అక్టోబర్ 30లోగా పెండింగ్ ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించాలి!

ఆదోనిలో 575 ఇళ్ల గ్రౌండింగ్‌కు గడువు.. అధికారులకు కలెక్టర్ డా.ఏ.సిరి ఆదేశం

రైతు రిజిస్ట్రీ పెండింగ్ దరఖాస్తులు రేపు సాయంత్రంలోగా పరిష్కరించాలి

ఈ-పంట ఈ-కేవైసీకి అక్టోబర్ 17 తుది గడువు

వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాలపై అసంతృప్తి.. ఎమ్మిగనూరులో 784 మరుగుదొడ్లు పెండింగ్

వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాలపై అసంతృప్తి.. ఎమ్మిగనూరులో 784 మరుగుదొడ్లు పెండింగ్



కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ అక్టోబర్ 12)
జిల్లాలో గృహ నిర్మాణ పథకాల కింద మంజూరైన ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేసి, పెండింగ్‌లో ఉన్న ఇళ్లను అక్టోబర్ 30వ తేదీలోగా గ్రౌండింగ్ చేయాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి అధికారులను ఆదేశించారు. రైతు రిజిస్ట్రీకి సంబంధించిన పెండింగ్ దరఖాస్తులను మంగళవారం సాయంత్రంలోగా పరిష్కరించాలని, ఈ-పంటలో ఈ-కేవైసీ ప్రక్రియను అక్టోబర్ 17వ తేదీ శనివారం నాటికి పూర్తి చేయాలని స్పష్టం చేశారు. కలెక్టరేట్ సమావేశ మందిరం నుంచి గృహ నిర్మాణం, టిడ్కో గృహాలు, వాట్సాప్ పాలన, ప్రజల్లో ప్రభుత్వ సేవలపై సానుకూల అభిప్రాయం తదితర అంశాలపై జిల్లా, మండల స్థాయి అధికారులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షించారు.

ఇళ్ల నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి
ఇళ్లు లేని ప్రతి పేద కుటుంబానికి సొంత ఇంటిని అందించాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం గృహ నిర్మాణాలకు ప్రాధాన్యత ఇస్తోందని కలెక్టర్ తెలిపారు. అయినప్పటికీ, ప్రధానమంత్రి ఆవాస్ యోజన గ్రామీణ పథకం అమలులో ఆశించిన పురోగతి లేకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించకపోవడానికి గల కారణాలను క్షేత్రస్థాయిలో గుర్తించి పరిష్కరించాలని ఆదేశించారు.మౌలిక సదుపాయాల కొరత, రుణ సదుపాయాలపై అవగాహన లేకపోవడం వంటి సమస్యలను పరిష్కరించడంతో పాటు, స్వయం సహాయక సంఘాల ద్వారా అర్హులైన లబ్ధిదారులకు అందే రుణ సదుపాయాలపై విస్తృత ప్రచారం కల్పించాలని సూచించారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన పట్టణ పథకాలు అర్బన్-1, అర్బన్-2తో పాటు గ్రామీణ గృహ నిర్మాణాల్లోనూ పురోగతి సాధించాలన్నారు.
ఆదోని పట్టణ పరిధిలో పెండింగ్‌లో ఉన్న 575 ఇళ్ల నిర్మాణాలను అక్టోబర్ 30లోగా ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. లబ్ధిదారుల సమస్యలను గుర్తించి సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఇళ్ల స్థలాలకు సంబంధించిన వివాదాలు, కోర్టు కేసులు, పట్టా సమస్యలను రెవెన్యూ అధికారుల సహకారంతో పరిష్కరించాలని ఎంపీడీవోలను ఆదేశించారు. ఇప్పటికే ఇళ్లు నిర్మించుకున్నవారు, అనర్హులుగా గుర్తించిన లబ్ధిదారుల వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, రికార్డుల్లోని అనవసర నమోదులను తొలగించాలని సూచించారు.

ఏడు నెలల్లో 21 మరుగుదొడ్లేనా?
వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాల్లో ఆశించిన స్థాయిలో పురోగతి లేకపోవడంపై కలెక్టర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఏప్రిల్ 1 నుంచి అక్టోబర్ 12 వరకు ఏడు నెలల వ్యవధిలో కేవలం 21 మరుగుదొడ్లు మాత్రమే నిర్మించడంపై అధికారులను ప్రశ్నించారు.
లబ్ధిదారులతో మాట్లాడుతున్నామనే పేరుతో కాలయాపన చేయకుండా నిర్మాణాలను వేగవంతం చేయాలన్నారు. ఎమ్మిగనూరు పరిధిలో ఇంకా 784 మరుగుదొడ్లు నిర్మించాల్సి ఉన్నందున, నెలవారీ లక్ష్యాలను నిర్దేశించుకుని నిర్దిష్ట గడువులోగా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు.

రైతు రిజిస్ట్రీ దరఖాస్తులకు తక్షణ పరిష్కారం
రైతులకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు సకాలంలో అందాలంటే రైతు రిజిస్ట్రీకి సంబంధించిన పెండింగ్ రికార్డులను వెంటనే పరిష్కరించాలని రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. రైతు రిజిస్ట్రీ ద్వారా ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి, వ్యవసాయ శాఖ పథకాలు, వ్యవసాయ ఉత్పత్తుల కొనుగోలుకు సంబంధించిన ప్రయోజనాలు అందుతాయని తెలిపారు.
కోడుమూరు, ఆదోని తదితర మండలాల్లో తహసీల్దార్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని పెండింగ్ రికార్డులన్నింటినీ మంగళవారం సాయంత్రంలోగా పరిష్కరించాలని స్పష్టం చేశారు.

ప్రమాణస్వీకారన్ని విజయవంతం చేసిన అందరికి కృతజ్ఞతలు

మార్కెట్ యార్డ్ చైర్ పర్సన్ మైలేరి సురేఖ

ఆళ్లగడ్డ అక్టోబర్ 12 రిపబ్లిక్ న్యూస్
ఆళ్లగడ్డ పట్టణం లో ఆదివారం జరిగిన మార్కెట్ యార్డ్ చైర్మన్ ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతిఒక్కరికి మార్కెట్ యార్డ్ చైర్ పర్సన్ మైలేరి సురేఖ, ఆళ్లగడ్డ జెనసేన పార్టీ సమన్వయకర్త మైలేరి మల్లయ్య కృతజ్ఞతలు తెలియజేసారు.



మైలేరి సురేఖ ప్రమాణ స్వీకార మహోత్సవంలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేసిన కూటమి నాయకులకు, కార్యకర్తలకు , ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా సోదరులకు, ఈ కార్యక్రమము జరగడానికి తగిన భద్రత కల్పించిన డీఎస్పీ కి, సిఐ కి, ఎస్ఐ కి, పోలీసు వారికి, మున్సిపల్ కమిషనర్ కి, మున్సిపల్ సిబ్బందికి ప్రతి ఒక్కరికీ పేరు పేరునా ధన్యవాదాలు తెలియజేశారు.


printed and published by B.Nagendra on behalf of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: BOJJANAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic@gmali.com

ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No./2023/87888

బాలత్రిపుర సుందరీ దేవి అలంకరణలో బోయకొండ గంగమ్మ

- పట్టు వస్త్రాలు సమర్పించిన మధుసూదన్ నాయుడు

చౌడేపల్లి ప్రతినిధి అక్టోబర్ 12 రిపబ్లిక్ న్యూస్



శక్తి స్వరూపిణి బోయకొండ గంగమ్మ బాల త్రిపుర సుందరీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి మధుసూదన్ నాయుడు దంపతులు బోయకొండ గంగమ్మకు పట్టు వస్త్రాలు సమర్పించారు దసరా మహోత్సవాన్ని పురస్కరించుకుని అమ్మవారి ఆలయంలో వివిధ రకాల పుష్పాలు వివిధ రకాల పండ్లతో దేదీప్యమానంగా అలంకరించారు డార్మెంటరీ హాల్ లో అమ్మవారి విగ్రహాలను ప్రతిష్టించి వివిధ హోమాధి కార్యక్రమాలు నిర్వహించారు పూర్ణాహుతిని గావించి అమ్మవారి దసరా ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ మధుసూదన్ నాయుడుకు ఘన స్వాగతం లభించింది. నియోజకవర్గం లోని పలు మండలాల నుంచి అధిక సంఖ్యలో నాయకులు కార్యకర్తలు హాజరయ్యారు. భవాని నగర్ లో గజమాలతో సత్కరించి ఆహ్వానం పలికారు. అనంతరం ఆలయంలో పట్టు వస్త్రాలు సమర్పించే సమయంలో ఈవో ఉప కమిషనర్ ఏకాంబరం సాదరంగా ఆహ్వానించి అమ్మవారి దర్శన భాగ్యం కల్పించారు అనంతరం మధుసూదన్ నాయుడు దంపతులను కుంకుమార్చన కార్యక్రమంలో భాగస్వాములు చేశారు. బోయకొండ గంగమ్మ ఆశీర్వాదంతో కూటమి ప్రభుత్వం అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు మధుసూదనాయుడు వివరించారు. అమ్మవారి కి పట్టు వస్త్రాలు సమర్పించడం పూర్వజన్మ సుకృతమన్నారు కూటమి ప్రభుత్వ నాయకులు ప్రభుత్వంపై చల్లని దీవెనలు ఉంటాయని ఈ సందర్భంగా ఆయన అన్నారు దసరా మహోత్సవాలలో భాగంగా అమ్మవారి ఆలయంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యము కల్పించకుండా తగిన ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని తెలుగుదేశం పార్టీ



నాయకులు, కార్యకర్తలు, ఆలయ అధికార అర్చక సిబ్బంది పాల్గొన్నారు.

రుద్రవరం గ్రామంలో పల్లెపండుగ 3.0 లో భాగంగా సిమెంట్ రోడ్ల నిర్మాణానికి భూమి పూజ చేసిన అధికారులు, టిడిపి నాయకులు

పాములపాడు అక్టోబర్ 12 రిపబ్లిక్ న్యూస్:-



పాములపాడు మండలంలోని, రుద్రవరం గ్రామంలో పల్లె పండుగగా 3.0 లో భాగంగా గ్రామంలోని, అంతర్గత సిమెంట్ రోడ్ నిర్మాణాలకు గ్రామ ప్రత్యేక అధికారి మండల వెటర్నరీ డాక్టర్ పసుపుల భాస్కర్, పంచాయతీ రాజ్ ఏఈ రాఘవేంద్ర ప్రసాద్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ విజయ్ బాబు, గ్రామ టీడీపీ నాయకులు రాచపూడి సురేష్, తెలుగు యువత మండల అధ్యక్షుడు షేక్.కరీం బాష, మధుసూదన్ రెడ్డి, తదితర నాయకులు కలిసి భూమి పూజ చేసి, పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పల్లె పండుగలో భాగంగా 20 లక్షల నిధులతో గ్రామంలోని, అంతర్గత సిమెంట్ రోడ్ల నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో చిన్నబాబుసా, మద్దిలేటి, నాగశేషులు, నిర్లం శ్రీను, నాగయ్య, మౌలాలి, అల్లాబకాష్, నాగరాజు, రవీంద్ర, బస్తీపాటి గోవిందు, మహేష్, వెంకట రాముడు, ఖాజా, నాగన్న, తదితరులు పాల్గొన్నారు.

కోట కందుకూరు లో వైసీపీ నీ వీడి టీడీపీ లోకి చేరిన 30 కుటుంబాలు .

ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ సమక్షంలో టీడీపీలో చేరిక








ఆళ్లగడ్డ అక్టోబర్ 12 రిపబ్లిక్ న్యూస్

ఆళ్లగడ్డ నియోజకవర్గంలో టీడీపీకి పెరుగుతున్న ఆదరణ.భూమా అఖిలప్రియ నాయకత్వంపై నమ్మకంతో సొంత గూటికి చేరుతున్న కార్యకర్తలు.ఆళ్లగడ్డ నియోజకవర్గంలోని కోట కందుకూరు గ్రామంలో తెలుగుదేశం పార్టీకి చెందిన నాయకత్వంపై నమ్మకంతో చాంద్ బాషా, మా భాష, ఆకుల హుస్సేన్, ఆకుల ఖాదర్, సున్నిసాగారి అల్లా బాకాష్, సున్నిసాగారి మక్బుల్‌తో పాటు మరో 30 కుటుంబాలు ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరాయి. పార్టీలోకి వచ్చిన వారందరికీ ఎమ్మెల్యే కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ మాట్లాడుతూ.తమపై నమ్మకంతో తిరిగి పార్టీలోకి వచ్చిన ప్రతి ఒక్కరికీ స్వాగతం పలుకుతున్నామని తెలిపారు. వీరంతా తమకు కొత్తవారు కాదని, గతంలో కొన్ని కారణాలతో దూరమైన వారు తిరిగి సొంత గూటికి చేరుకోవడం సంతోషంగాఉందన్నారు. పాత, కొత్త అనే తేడా లేదు.. ప్రతి కార్యకర్తకు అండగా ఉంటాం!భూమా కుటుంబంపై నమ్మకంతో పార్టీలోకి వచ్చిన ప్రతి కార్యకర్తకు అండగా ఉంటామని అఖిలప్రియ హామీ ఇచ్చారు. కార్యకర్తల సమస్యల పరిష్కారం కోసం ఎంతదూరమైనా వెళ్లి పోరాడతామని, ప్రతి ఒక్కరినీ కలుపుకొని పార్టీని మరింత బలోపేతం చేస్తామని స్పష్టం చేశారు. భూమా నాగిరెడ్డి నుంచి నేర్చుకున్న ప్రజాసేవా స్ఫూర్తితో అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగిస్తామని పేర్కొన్నారు.రెండు నెలల్లో కందుకూరు రోడ్ల రూపురేఖలు మారుస్తా కందుకూరు గ్రామంలో రోడ్లు, డ్రైనేజీ, పారిశుద్ధ్య సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తామని ఎమ్మెల్యే తెలిపారు. రాబోయే రెండు నెలల్లో కందుకూరు రోడ్ల అభివృద్ధిలో స్పష్టమైన మార్పు తీసుకువచ్చేలా కృషి చేస్తానని గ్రామ ప్రజలకు హామీ ఇచ్చారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడమే తమ ప్రధాన లక్ష్యమన్నారు.ఓట్ల కోసం కాదు.. ప్రజల అభివృద్ధి కోసమే మా రాజకీయాలు.కూటమి ప్రభుత్వం ప్రజల సంక్షేమం, గ్రామాల అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తోందని అఖిలప్రియ తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ నాయకత్వంలో అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై ప్రజల్లో విశ్వాసం పెరుగుతోందన్నారు. ఆళ్లగడ్డ నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, కార్యకర్తలకు అందిస్తున్న అండ చూసి వివిధ గ్రామాల నుంచి ప్రజలు, కార్యకర్తలు టీడీపీ వైపు వస్తున్నారని పేర్కొన్నారు.రాబోయే ఎన్నికల్లో టీడీపీ విజయానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. తమను నమ్మి పార్టీలో చేరిన ప్రతి ఒక్కరి నమ్మకాన్ని నిలబెట్టుకుంటామని, కందుకూరు గ్రామాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు కట్టుబడి ఉంటామని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ స్పష్టం చేశారు.

పుదిపట్ల స్వయంభు శ్రీ వైష్ణవి దేవి ఆలయంలో నేత్రపర్వంగా గాయత్రీ దేవి అలంకరణ

చౌడేపల్లి ప్రతినిధి అక్టోబర్ 12 రిపబ్లిక్ న్యూస్



అన్నమయ్య జిల్లా చౌడేపల్లి మండలం పుదిపట్ల గ్రామంలో వెలసిన స్వయంభు శ్రీ వైష్ణవి దేవి ఆలయంలో దసరా నవరాత్రుల వేడుకలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాలలో భాగంగా రెండవ రోజైన సోమవారం అమ్మవారు శ్రీ గాయత్రీ దేవి అలంకారంలో భక్తులకు అభయమిచ్చారు.ఉత్సవాల్లో భాగంగా ఉదయమే ఆలయ అర్చకరాలు శ్రావణి అమ్మవారికి అత్యంత భక్తిశ్రద్ధలతో పంచామృత అభిషేకం నిర్వహించారు. అనంతరం అమ్మవారిని సకల ఆభరణాలు, విశేష పుష్పాలతో గాయత్రీ దేవి రూపంలో సుందరంగా అలంకరించారు.ఈ దివ్యదర్శనం కోసం చౌడేపల్లి చుట్టుపక్కల గ్రామాలతో పాటు బెంగళూరు, మదనపల్లి, పుంగనూరు తదితర ప్రాంతాల నుండి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారి కృపకు పాత్రులై ప్రత్యేక పూజలు నిర్వహించారు.నేటి ఉభయదారులుగా లబ్ధిగం గ్రామానికి చెందిన పచ్చిరాల కుటుంబ సభ్యులు వ్యవహరించారు. ఆలయ ధర్మకర్త వినోద్ కుమార్ ఆధ్వర్యంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేసి, అమ్మవారి తీర్థప్రసాదాలను అందజేశారు. దసరా శరన్నవరాత్రుల సందర్భంగా ఆలయ ప్రాంగణం భక్తుల నామస్మరణతో మార్మోగింది.

ప్రజా ఉద్యమం అడ్డుకోలేరు

- వ్యకాసా, సిఐటియు



బండి ఆత్మకూరు, అక్టోబర్ 12,(రిపబ్లిక్ న్యూస్):- చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేసింతవరకు ప్రజా ఉద్యమాలు ఆగవని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ నాయక్, సిఐటియు జిల్లా నాయకులు రత్నమయ్య అన్నారు. సర్ ను రద్దు చేయాలని, సిఇసి జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలనే డిమాండ్ తో సోమవారం బండి ఆత్మకూరు బస్టాండ్ సెంటర్ నందు దేవిడ్ అధ్యక్షతన సిఈసి జ్ఞానేష్ కుమార్ దిష్టిబొమ్మ దగ్ధం చేసి నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జ్ఞానేష్ కుమార్ ను కేంద్ర ప్రభుత్వం అక్రమ పద్ధతిలో ఎన్నికల కమిషనర్ గా నియమించిందన్నారు. తమకు అనుకూలమైన ఓట్లను పెంపొందించుకొని వ్యతిరేకమైన ఓట్లను తొలగించడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. ఆర్టికల్ 14, చట్టం 326 ప్రకారంగా భారతదేశంలో 18 ఏళ్లు నిండిన ప్రతి పౌరుడుకి ఓటు హక్కు ఇవ్వాలని రాజ్యాంగంలో పొందుపరచడం జరిగిందన్నారు.కానీ బిజెపి ప్రభుత్వం అన్ని రాష్ట్రాల గెలవడానికి సర్ పేరుతో కులాల,మతాల పేర్లతో 13 కోట్ల ఓట్లను తొలగించి రాజ్యాంగ విరుద్ధ చర్యలకు పాల్పడుతుందన్నారు. ఇందులో ప్రధాన ఎలక్షన్ కమిషన్ వ్యవహరించిన వారికి జెడ్ ప్లస్ కేటగిరి భద్రత కేటాయించి కాపాడుతుందన్నారు. సర్ ప్రక్రియను నిలిపివేయాలని వామపక్ష నాయకులు, విద్యార్థి,ప్రజా సంఘాల నాయకులు చేపట్టిన ఉద్యమమును ఢిల్లీలో పోలీసు నిర్బంధంతో అడ్డుకోవడం సరైన విధానం కాదన్నారు. ప్రజా ఉద్యమాన్ని ఎవరు అడ్డుకోలేరని వారు హెచ్చరించారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఆలోచించి తక్షణమే, ఎలక్షన్ కమిషన్ తప్పించాలని డిమాండ్ చేశారు. లేదంటే దేశవ్యాప్తంగా మరో స్వతంత్ర పోరాటం చేయడం తప్పదనీ ప్రజా సంఘాల నాయకులు అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం సీనియర్ నాయకుడు టి రామచంద్రుడు, సిఐటియు, రాజు తదితరులు పాల్గొన్నారు

ఓంకారంలో వైభవంగా శరన్నవరాత్రి ఉత్సవాలు

శ్రీ గాయత్రీ దేవి అలంకారంలో ఉమాదేవి అమ్మవారు

బండి ఆత్మకూరు, అక్టోబర్ 12, (రిపబ్లిక్ న్యూస్):- నల్లమల అటవీ ప్రాంతంలోనీ శ్రీ గంగా ఉమా సమేత ఓంకార సిద్దేశ్వర స్వామి వారు వెలసిన ఓంకార క్షేతంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా రెండవ రోజు సోమవారం ఉమాదేవి అమ్మవారు శ్రీ గాయత్రీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ అల్లే చెన్నారెడ్డి, ఆలయ కార్యనిర్వహణ అధికారి నాగ ప్రసాద్ ల ఆధ్వర్యంలో అర్చకులు భాస్కర్ శర్మ, సుధాకర్ శర్మలు అమ్మవారిని శ్రీ గాయత్రీ దేవిగా అలంకరణ చేశారు. ముందుగా స్వామి వారికి అభిషేకం, అమ్మవారికి కుంకుమ అర్చన, నవగ్రహ మండపారాధన, మహా మంగళహారతి, మంత్ర పుష్పం తీర్థ ప్రసాద వితరణ వంటి ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఉభయ దాతలు చైతన్య కుమార్ రెడ్డి డిప్యూటీ డైరెక్టర్ ప్రాజెక్టు టైగర్ నంద్యాల ఆయన సతీమణి కావ్య లు స్వామి, అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. పూజల అనంతరం ఆలయ



అధికారులు మర్యాదపూర్వకంగా ఉభయ దాతలకు అర్చకుల వేద మంత్ర ఆశీర్వచనాలు అందించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అలాగే వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. క్షేత్రానికి వచ్చిన భక్తులకు కాశిరెడ్డి నాయన ఆశ్రమ నిర్వాహకులు అన్న ప్రసాద వితరణ చేశారు.



"గ్రూప్-2" మైనారిటీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ

ఈ నెలాఖరు వరకు దరఖాస్తుకు గడువు -మైనారిటీ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్

అమరావతి, అక్టోబరు 12(రిపబ్లిక్ న్యూస్) :

రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ఏపీపీఎస్సీ ద్వారా భర్తీ చేస్తున్న గ్రూప్-2 ఉద్యోగాల కోసం పోటీపడే మైనారిటీ అభ్యర్థులకు ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మైనారిటీ, న్యాయ శాఖల మంత్రి ఎన్ఎండి ఫరూక్ తెలిపారు. ఈ నెలాఖరు 31వ తేదీ లోగా అర్హత కలిగిన వారందరూ ఉచిత శిక్షణ కోసం దరఖాస్తు చేసుకోవాలని అమరావతి లో సోమవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో మంత్రి కోరారు.మైనారిటీ సంక్షేమ శాఖ పరిధిలోని సెంటర్ ఫర్ ఎడ్యుకేషనల్ డెవలప్‌మెంట్ ఆఫ్ మైనారిటీస్(సిఈడియం) నేతృత్వంలో అర్హులైన మైనారిటీ అభ్యర్థులకు ఏపీపీఎస్సీ గ్రూప్-2 నియామక పరీక్షల కోసం ఆన్ లైన్/ఆఫ్ లైన్ లో ఉచిత శిక్షణ ఇచ్చేందుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లను పూర్తి చేసిందన్నారు.ఇందులో భాగంగా అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు మంత్రి పేర్కొన్నారు.బిపిఎల్ కార్డు కలిగి ఉండటం ఆఫ్‌లైన్ కోచింగ్‌కు తప్పనిసరి అర్హతగా పరిగణించబడుతుందని వెల్లడించారు.దరఖాస్తు సమయంలో సంబంధిత బిపిఎల్ కార్డు(తెల్ల రేషన్ కార్డు)/ధృవీకరణ పత్రాన్ని సమర్పించాల్సి ఉంటుందన్నారు. గ్రూప్ -2 ఉద్యోగాల సాధన కోసం పోటీపడే మైనారిటీ అభ్యర్థులకు నాణ్యమైన శిక్షణ తో పాటు విద్యాపరమైన మద్దతును అందించడమే ఉచిత శిక్షణ ముఖ్య ఉద్దేశ్యమని మంత్రి ఫరూక్ పేర్కొన్నారు. ఉచిత శిక్షణలో రాత పరీక్ష సన్నద్ధత, జనరల్ స్టడీస్, రీజనింగ్, కరెంట్ అఫైర్స్ తో పాటు నియామక పరీక్షకు నిర్దేశించిన ఇతర సంబంధిత అంశాలపై పూర్తి దృష్టి సారిస్తారని తెలిపారు.మైనారిటీ వర్గాలకు చెందిన అర్హులైన అభ్యర్థులు, నిర్దేశించిన అర్హతా షరతులకు లోబడి దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అర్హత,ఆసక్తిగల రాష్ట్రవ్యాప్త మైనారిటీ అభ్యర్థులందరూ తమ వివరాలను"సిఈడియం-ఏపీ" అధికారక వెబ్ సైట్ ద్వారా ఆన్ లైన్ పద్ధతిలో నమోదు చేసుకోవాలని కోరారు.వెబ్ సైట్ : www.apcedmmwd.org లేదా సెల్ నెంబర్లు: 08645-297535,7386789966 లను సంప్రదించాలని మైనారిటీ మంత్రి ఎన్ఎండి ఫరూక్ కోరారు.

83 ఫిర్యాదులు.. చట్ట ప్రకారం విచారణ జరిపి బాధితులకు న్యాయం చేస్తాం

ఉద్యోగాల పేరుతో లక్షల రూపాయల మోసాలు.. భూ వివాదాలు, దాడులపై ఎస్పీకి వినతులు

కర్నూలు క్రైమ్ ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ అక్టోబర్ 12)

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు వచ్చిన ప్రతి ఫిర్యాదుపై చట్ట ప్రకారం విచారణ జరిపి బాధితులకు న్యాయం చేస్తామని కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ హామీ ఇచ్చారు. ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.కర్నూలు నగరంలోని కొత్తపేటలో, కర్నూలు రెండో పట్టణ పోలీస్ స్టేషన్ పక్కన ఉన్న ఎస్పీ క్యాంపు కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బాధితుల నుంచి ఎస్పీ స్వయంగా వినతులను స్వీకరించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమానికి మొత్తం 83 ఫిర్యాదులు అందాయి.

ఉద్యోగాల పేరుతో లక్షల రూపాయల మోసాలు

విద్యుత్ శాఖలో సబ్‌స్టేషన్ ఆపరేటర్, కంప్యూటర్



ఆపరేటర్ ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి తన భార్యతో పాటు మరో ఇద్దరి నుంచి ఓ వ్యక్తి రూ. 14 లక్షలు తీసుకొని మోసం చేశాడని కర్నూలు కప్పల్ నగర్‌కు చెందిన జమ్మన్న ఫిర్యాదు చేశారు. బాధ్యుడిపై చర్యలు తీసుకోవాలని కోరారు.ఆదోని ప్రభుత్వ పశువైద్య శాఖలో ఇద్దరికి ఉద్యోగాలు ఇప్పిస్తామని రూ. 5 లక్షలు తీసుకొని మోసం చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని ఆదోనికి చెందిన షేక్‌షావలి వినతిపత్రం సమర్పించారు.కలెక్టర్ కార్యాలయంలో ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి రూ. 4 లక్షలు తీసుకొని మోసం చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని నంద్యాలకు చెందిన సునీత ఫిర్యాదు చేశారు.

దాడులు, భూ ఆక్రమణలపై ఫిర్యాదులు

తనపై, తన భర్తపై దాడి చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని దేవనకొండ మండలం పి. కోటకొండ గ్రామానికి చెందిన హుస్సేన్ బీ ఫిర్యాదు చేశారు.తమ పొలాన్ని ఆక్రమించుకునేందుకు దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని హాలహర్వి మండలం గూల్యం గ్రామానికి చెందిన లక్ష్మీకాంత్ ఎస్పీని కోరారు.ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు అందిన అన్ని వినతులపై సంబంధిత అధికారులు చట్ట ప్రకారం విచారణ జరిపి, సమస్యలను త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) హుస్సేన్ పీరా, సీఐలు శివశంకర్, రామకృష్ణ, మస్తాన్ వలి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No:/2023/87888

మహిళా సాధికారతకు సీఎం చంద్రబాబు పెద్దపీట

మహిళలు స్వయం సమృద్ధి సాధించేలా చర్యలు -వైసీపీ హయాంలో మహిళా సంఘాలకు అన్యాయం

ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి విమర్శ - రూ.50.56 కోట్ల శ్రీనిధి, సీఐఎఫ్ రుణాల పంపిణీ

పుట్టపర్తి సంక్షేమం, అక్టోబర్ 12,(రిపబ్లిక్ న్యూస్):
మహిళా సాధికారతకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి పేర్కొన్నారు. మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసి, స్వయం ఉపాధి ద్వారా ఆర్థిక స్వావలంబన సాధించేలా ప్రభుత్వం పలు చర్యలు చేపడుతోందని తెలిపారు.సోమవారం పుట్టపర్తిలోని సాయి ఆరామంలో పుట్టపర్తి నియోజకవర్గ కొత్త చెరువు, పుట్టపర్తి బుక్కపట్నం మండలాల మహిళా సాధికారతపై మహిళా సంఘాల సభ్యులతో నిర్వహించిన సమావేశంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని 568 మహిళా సంఘాలకు సుమారు రూ.50.56 కోట్ల మేర బ్యాంకు లింకేజీ, ఉన్నతి, శ్రీనిధి, సీఐఎఫ్ రుణాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి



డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డితో పాటు పీడీ నర్సయ్య పాల్గొన్నారు.
ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందితే కుటుంబాలు, గ్రామాలు, సమాజం అభివృద్ధి చెందుతాయని పేర్కొన్నారు. మహిళా సంఘాల సభ్యులు రుణాలను సద్వినియోగం చేసుకొని చిన్నతరహా పరిశ్రమలు, స్వయం ఉపాధి కార్యక్రమాలు చేపట్టడం ద్వారా ఆదాయాన్ని పెంచుకోవాలని సూచించారు. మహిళలు ఇతరులపై ఆధారపడకుండా ఆర్థికంగా స్వతంత్రంగా ఎదిగేందుకు ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.
గత వైసీపీ ప్రభుత్వ హయాంలో మహిళా సంఘాల నిధుల నిర్వహణలో తీవ్ర అన్యాయం జరిగిందని వారు విమర్శించారు. కూటమి ప్రభుత్వం మహిళల సంక్షేమం, ఆర్థికాభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ వివిధ సంక్షేమ పథకాల ద్వారా మహిళలకు లబ్ధి చేకూర్చేలా చర్యలు తీసుకుంటోందని తెలిపారు.మహిళా సంఘాలు బలోపేతం కావడంతో పాటు సభ్యుల కుటుంబాల జీవన ప్రమాణాలు మెరుగుపడేలా ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. మహిళలు ఆర్థికంగా ఎదిగి, తమ కుటుంబాల అభివృద్ధిలో కీలక పాత్ర పోషించాలని ఆకాంక్షించారు.

ఆర్టీఐ చట్టాన్ని పటిష్ఠంగా అమలు చేయాలి

అధికారులకు అవగాహన కల్పించాలి -ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఐక్య సంఘాల ర్యాలీ

అనంతపురం సంక్షేమం, అక్టోబరు 12,(రిపబ్లిక్ న్యూస్):
సమాచార హక్కు చట్టం2005ను సమర్థంగా అమలు చేయాలని, ప్రభుత్వ అధికారులకు చట్టంలోని నిబంధనలపై అవగాహన కల్పించాలని వివిధ ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. చట్టంపై ప్రజల్లో చైతన్యం తీసుకొస్తున్న సమాచార హక్కు కార్యకర్తలను గుర్తించి ప్రోత్సహించాలని కోరారు. సమాచార హక్కు చట్టం ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సోమవారం ఉదయం అనంతపురంలో ఐక్య సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. టవర్‌క్లాక్ నుంచి ప్రారంభమైన ర్యాలీ సప్తగిరి సర్కిల్ మీదుగా తిరిగి టవర్‌క్లాక్ వద్దకు చేరుకుంది.

చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలి
ఈ సందర్భంగా ఫైట్ ఫర్ రైట్స్ వ్యవస్థాపకుడు కె.పి.రాజు, సమాచార హక్కు పరిరక్షణ సంఘం వ్యవస్థాపకుడు హొన్నూరప్ప, సమాచార హక్కు ఐక్యవేదిక వ్యవస్థాపకుడు లాల్యానాయక్, సమాచార హక్కు చైతన్య వేదిక అధ్యక్షుడు రాయల కొండయ్య మాట్లాడుతూ



సమాచార హక్కు చట్టంలోని సెక్షన్ 4(1)(బి)పై జిల్లా కలెక్టర్‌కు అవగాహన లేదని విమర్శించారు. ప్రభుత్వ శాఖల్లో పారదర్శకత, జవాబుదారీతనం పెరగాలంటే చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని సూచించారు.
ప్రజలకు ప్రభుత్వ పాలనకు సంబంధించిన సమాచారం అందుబాటులో ఉండేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. సమాచార హక్కు చట్టంపై ప్రభుత్వ శాఖల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. చట్టాన్ని వినియోగించుకునే పౌరులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని, ప్రజల్లో



చైతన్యం కల్పిస్తున్న ఆర్టీఐ కార్యకర్తలను ప్రోత్సహించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఎం.సి.బాలన్న, ఎ.ప్రసాద్, భీమప్ప, శ్రీదేవి, తిరుపాల్, అజ్జు భాయ్, సామ్రాట్ మధు, ఎస్.హెచ్.ఐ.వి. రాష్ట్ర నాయకులు, ఎస్సీ, ఎస్టీ ప్రజా సమాఖ్యకు చెందిన మద్దుల చెరువు మల్లీ, ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదికకు చెందిన టీవీ రెడ్డి, ఫైట్ ఫర్ రైట్స్ సభ్యులు శంకర్‌రెడ్డి, సుధాకర్, సత్యనారాయణ, హేమంత్, పవన్, బోయ దొర, జుటూరు రామాంజి, సురేష్, గట్టు రామాంజి, రామకృష్ణ, కొడవండ్ల నరేష్, చలపతి, పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కాన్షిరాం ఆశయాల స్ఫూర్తితో సేవా కార్యక్రమాలు

అనాథాశ్రమంలో చిన్నారులకు దుస్తుల పంపిణీ

గుత్తి అక్టోబర్ 12 (రిపబ్లిక్ న్యూస్)
బహుజన సమాజ్ పార్టీ వ్యవస్థాపకుడు మాన్యశ్రీ కాన్షిరాం వర్ధంతిని పురస్కరించుకుని బీఎస్పీ నాయకులు సేవా కార్యక్రమం నిర్వహించారు. గుత్తి పట్టణంలోని కొత్తూరు అనాథాశ్రమంలో చిన్నారులకు దుస్తులు పంపిణీ చేశారు. రాయలసీమ ఇన్‌చార్జి గద్దల నాగభూషణం, గుంతకల్లు నియోజకవర్గ ఇన్‌చార్జి విజయ్, గుత్తి పట్టణ కార్యదర్శి రామాంజనేయులు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు.ఈ సందర్భంగా నాయకులు చిన్నారులకు దుస్తులు అందజేశారు.కాన్షిరాం వర్ధంతిని పురస్కరించుకుని సమాజానికి ఉపయోగపడే సేవా కార్యక్రమాలు నిర్వహించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. అనాథాశ్రమంలోని



పిల్లలకు దుస్తులు పంపిణీ చేయడం ద్వారా వారిలో ఆనందాన్ని నింపేందుకు ప్రయత్నించినట్లు పేర్కొన్నారు

సేవా కార్యక్రమాలే నిజమైన నివాళి
ఈ సందర్భంగా బీఎస్పీ నాయకులు మాట్లాడుతూ.. బహుజనుల అభ్యున్నతి కోసం జీవితాంతం కృషి చేసిన కాన్షిరాం ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. సమాజంలో పేదలు, నిరుపేదలు, అనాథ పిల్లలకు అండగా నిలవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ఆపదలో ఉన్నవారికి తమ వంతు సహాయం అందించినప్పుడే సమాజంలో మానవత్వం వెల్లివిరుస్తుందని అన్నారు.
డాక్టర్ బీఆర్ అంబేద్కర్, కాన్షిరాం ఆశయాల స్ఫూర్తితో సామాజిక సమానత్వం, బహుజనుల అభ్యున్నతి కోసం కృషి చేయాలని తెలిపారు. పేదలకు, నిరాదరణకు గురైన చిన్నారులకు సహాయ సహకారాలు అందిస్తూ వారి జీవితాల్లో వెలుగులు నింపేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని కోరారు. కేవలం జయంతులు, వర్ధంతులకే పరిమితం కాకుండా నాయకుల ఆశయాలను ఆచరణలో పెట్టాలని సూచించారు.
భవిష్యత్తులోనూ పేదలకు, అవసరంలో ఉన్నవారికి తమ వంతు సహకారం అందిస్తూ సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామని బీఎస్పీ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మఠం భూములపై వివాదం..

ఉనికిలో లేని మరో మఠం పేరుతో రిజిస్టర్ సృష్టించారా?

61.08 ఎకరాల భూమిపై వివాదం.. సెక్షన్ 43 రిజిస్టర్ రద్దు చేసి సమగ్ర విచారణ జరపాలని పీఠాధిపతి డిమాండ్

కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ అక్టోబర్ 12)
కర్నూలు జిల్లా హాలహర్వి మండలం జంగమర హోసళ్లి గ్రామంలోని శ్రీ పట్టద స్వామి మఠానికి చెందిన భూముల వ్యవహారం వివాదాస్పదంగా మారింది. తమ మఠానికి చెందిన భూములకు సంబంధించి దేవాదాయ శాఖ అధికారులు ఉనికిలో లేని మరో మఠం పేరుతో సెక్షన్ 43 రిజిస్టర్ తయారు చేశారంటూ శ్రీ పట్టద స్వామి మఠం పీఠాధిపతి ఆరోపిస్తున్నారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేస్తున్నారు.

61.08 ఎకరాల భూమిపై వివాదం
జంగమర హోసళ్లి గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 169లో మొత్తం 63.52 ఎకరాల భూమి ఉన్నట్లు పీఠాధిపతి పేర్కొంటున్నారు. ఇందులో కాలువలకు పోను మిగిలిన 61.08 ఎకరాల భూమి తమ మఠం ఆధీనంలో ఉందని చెబుతున్నారు. ఈ భూములకు సంబంధించి అసలు రికార్డులను పరిగణనలోకి తీసుకోకుండా అధికారులు వ్యవహరించారని ఆయన అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు
మరో మఠం పేరుతో రిజిస్టర్ ఎలా తయారు చేశారు?
తమను సంప్రదించకుండానే దేవాదాయ శాఖ అధికారులు



శ్రీ రత్తడ స్వామి మఠం పేరుతో సెక్షన్ 43 రిజిస్టర్ తయారు చేశారని పీఠాధిపతి ఆరోపిస్తున్నారు. ఉనికిలో లేని మఠం పేరుతో రిజిస్టర్ రూపొందించాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్నిస్తున్నారు. శ్రీ పట్టద స్వామి మఠానికి సంబంధించిన అసలు రికార్డులను పరిశీలించకుండా ఈ ప్రక్రియ చేపట్టడం పట్ల ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.

రిజిస్టర్ రద్దు చేసి విచారణ జరపాలి
వివాదాస్పదంగా మారిన సెక్షన్ 43 రిజిస్టర్‌ను వెంటనే రద్దు చేయాలని పీఠాధిపతి అధికారులను కోరుతున్నారు. మఠానికి సంబంధించిన అసలు రికార్డులు, భూముల వివరాలు, సంబంధిత పత్రాలను సమగ్రంగా పరిశీలించి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని డిమాండ్ చేస్తున్నారు. భూముల వ్యవహారంలో నిష్పక్షపాతంగా విచారణ జరిపి న్యాయం చేయాలని కోరుతున్నారు.

అధికారుల స్పందనపై ఆసక్తి
శ్రీ పట్టద స్వామి మఠం భూములకు సంబంధించి పీఠాధిపతి చేసిన ఆరోపణలు ప్రస్తుతం చర్చనీయాంశంగా మారాయి. సెక్షన్ 43 రిజిస్టర్ తయారీ వెనుక ఉన్న కారణాలేమిటి? సంబంధిత భూములకు సంబంధించిన అసలు రికార్డులు ఏమి చెబుతున్నాయి? మరో మఠం పేరుతో రిజిస్టర్ తయారైందన్న ఆరోపణల్లో వాస్తవమెంత? అనే అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది.
దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు ఈ వ్యవహారంపై స్పందించి, సంబంధిత రికార్డులను పరిశీలించి సమగ్ర విచారణ చేపడతారా? పీఠాధిపతి అభ్యంతరాలపై ఎలాంటి చర్యలు తీసుకుంటారు? అన్నది వేచి చూడాల్సి ఉంది.

నగర ప్రగతికి రూ.300 కోట్లు

ఎమ్మెల్యే దగ్గుబాటి ప్రసాద్ -సీసీ రోడ్లు పనులకు భూమిపూజ

ఓల్డ్‌టౌన్ తాగునీటి సమస్యకు రూ.107 కోట్లతో పరిష్కారం





అనంతపురం సంక్షేమం, అక్టోబర్ 12,(రిపబ్లిక్ న్యూస్):
నగర అభివృద్ధే లక్ష్యంగా అడుగులు వేస్తున్నామని, మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నామని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు. నగరంలో రూ.300 కోట్లకు పైగా నిధులతో అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని, నెల రోజుల వ్యవధిలోనే రూ.200 కోట్ల విలువైన పనులు ప్రారంభించామని వెల్లడించారు. తాజాగా రూ.1.14 కోట్లతో చేపట్టనున్న సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులకు ఆయన భూమిపూజ చేశారు.నగరంలో ఏళ్ల తరబడి పేరుకుపోయిన సమస్యలకు పరిష్కారం చూపించడంపై దృష్టి సారించినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. ముఖ్యంగా గత 20 నుంచి 25 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న డ్రైనేజీ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఓల్డ్‌టౌన్ పరిధిలో ప్రతి ఇంటికీ తాగునీటి కొళాయి కనెక్షన్ అందించాలనే లక్ష్యంతో రూ.107 కోట్లతో భారీ ప్రాజెక్టును ప్రారంభించినట్లు వివరించారు.ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సహకారంతో నగర అభివృద్ధికి మరిన్ని నిధులు సమకూరుతున్నాయని, గత వారంలోనే మున్సిపాలిటీకి మరో రూ.50 కోట్ల విలువైన పనులు మంజూరయ్యాయని దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు. రానున్న రెండేళ్లలో నగరంలోని మౌలిక వసతుల సమస్యలను పరిష్కరించి, అనంతపురాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తామని చెప్పారు.సీసీ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థల మెరుగుదలతో పాటు తాగునీటి సదుపాయాల కల్పనకు ప్రాధాన్యమిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, స్థానిక టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ధన్వి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ను ప్రారంభించిన ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ





ఆళ్లగడ్డ అక్టోబర్ 12 రిపబ్లిక్ న్యూస్ నంద్యాల పట్టణంలోని బాలాజీ కాంప్లెక్స్ వద్ద నూతనంగా నిర్మించిన ధన్వి మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ పాల్గొని ఆసుపత్రిని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ మాట్లాడుతూ..ఈరోజు నంద్యాల పట్టణంలోని బాలాజీ కాంప్లెక్స్ వద్ద ధన్వి మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ప్రారంభోత్సవానికి రావడం చాలా ఆనందంగా ఉంది. సాధారణంగా ఆసుపత్రుల నిర్మాణంలో స్థలాభావం కారణంగా రోగులకు, అత్యవసరంగా వచ్చే వాహనాలకు ఇబ్బందులు ఎదురవుతుంటాయి. అయితే ఈ ఆసుపత్రిని సందర్శించిన తర్వాత ఇక్కడ అందుబాటులో ఉన్న విశాలమైన స్థలం, చక్కటి గదులు, ప్రత్యేక గదుల ఏర్పాటు నన్ను ఎంతగానో ఆకట్టుకున్నాయి.డాక్టర్ శ్రీకాంత్ , కీర్తి, ముందుకు వచ్చి ఇలాంటి ఆసుపత్రిని ఏర్పాటు చేయడం అభినందనీయం. ఈ ఆసుపత్రి నంద్యాల పట్టణానికే పరిమితం కాకుండా, నంద్యాల జిల్లా ప్రజలందరికీ మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఉపయోగపడాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను.ఈరోజు ఈ కార్యక్రమానికి ఫరూక్ తో పాటు పలువురు నాయకులు, ప్రముఖులు హాజరయ్యాం. డాక్టర్ శ్రీకాంత్ , కీర్తి మరియు వారి కుటుంబంపై మాకు ఉన్న నమ్మకం, ప్రజలకు మంచి వైద్య సేవలు అందించాలనే వారి ఆలోచన ఈ కార్యక్రమంలో పాల్గొనేలా చేశాయి.ధన్వి హాస్పిటల్ నిర్వాహకులు, వైద్యులు, సిబ్బంది అందరికీ ప్రత్యేకంగా అభినందనలు తెలియజేస్తున్నాను. ఈ ఆసుపత్రి మరింత అభివృద్ధి చెందుతూ, నంద్యాల జిల్లా నుంచి రాష్ట్రవ్యాప్తంగా వైద్య సేవలను విస్తరించే స్థాయికి ఎదగాలని ఆకాంక్షిస్తున్నాను. మరోసారి డాక్టర్ శ్రీకాంత్ కి, కీర్తి కి, వారి కుటుంబ సభ్యులకు, మొత్తం వైద్య బృందానికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను అని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అన్నారు.

బాల్యవివాహాల కట్టడికి ముగతి సంకల్పం

గ్రామసభలో ఏకగ్రీవ తీర్మానం -18 ఏళ్లు నిండిన అమ్మాయి.. 21 ఏళ్లు నిండిన అబ్బాయికే పెళ్లి

బాల్యవివాహాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు





నందవరం, అక్టోబరు 12 రిపబ్లిక్ న్యూస్ :
బాల్యవివాహాల నిర్మూలనే లక్ష్యంగా నందవరం మండలం ముగతి గ్రామాన్ని బాల్యవివాహ రహిత గ్రామంగా తీర్చిదిద్దేందుకు గ్రామసభలో ఏకగ్రీవంగా తీర్మానించారు. మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమశాఖ, జిల్లా బాలల పరిరక్షణ విభాగం, చైల్డ్ హెల్ప్‌లైన్1098 ఆధ్వర్యంలో ప్రత్యేక గ్రామసభ నిర్వహించారు.సూపర్‌వైజర్ గురుశేఖరమ్మ మాట్లాడుతూ బాల్యవివాహ నిషేధ చట్టం2006 ప్రకారం అమ్మాయికి 18, అబ్బాయికి 21 ఏళ్లు నిండిన తర్వాతే వివాహం చేయాలని సూచించారు. చట్టాన్ని ఉల్లంఘించిన వారికి నేర స్వభావాన్ని బట్టి గరిష్ఠంగా రెండేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.లక్ష వరకు జరిమానా లేదా రెండూ విధించే అవకాశం ఉందని వివరించారు.DCPU సామాజిక కార్యకర్త నరసింహులు మాట్లాడుతూ బాల్యవివాహాల వల్ల బాలికల విద్య, ఆరోగ్యం, భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం పడుతుందన్నారు. తల్లిదండ్రులు బాలికల చదువును కొనసాగించేలా ప్రోత్సహించాలని కోరారు. చైల్డ్ హెల్ప్‌లైన్1098 ప్రాజెక్టు కోఆర్డినేటర్ సుంకన్న మాట్లాడుతూ బాల్యవివాహాలు, బాల కార్మికులు, బాలలపై వేధింపులు, అక్రమ రవాణా వంటి ఘటనలు గుర్తిస్తే వెంటనే 1098కు సమాచారం అందించాలని సూచించారు.గ్రామాన్ని బాల్యవివాహ రహితంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని VRO చక్రవర్తి గౌడ్ గ్రామస్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో చైల్డ్ హెల్ప్‌లైన్ ప్రతినిధి భాస్కర్, అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్త్ ఆఫీసర్ శ్వేత తదితరులు పాల్గొన్నారు.

దసరా పండుగను పురస్కరించుకుని రాయికల్‌లో

ఘనంగా శావ ఉత్సవం ఆధ్యాత్మిక సందడి..





రాయికల్ మండలం అక్టోబర్,12(రిపబ్లిక్ న్యూస్)

దసరా పండుగను పురస్కరించుకుని జగిత్యాల జిల్లా రాయికల్ పట్టణంలో శావ ఉత్సవం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ప్రతి సంవత్సరం దసరా పండుగ సందర్భంగా సంప్రదాయబద్ధంగా నిర్వహించే ఈ ఉత్సవం పట్టణంలో ఆధ్యాత్మిక వాతావరణాన్ని నింపుతుంది. భక్తులు, స్థానికులు ఉత్సాహంగా పాల్గొని ఉత్సవాన్ని విజయవంతం చేస్తారు.

దసరా పండుగ విజయదశమి సందర్భంగా అమ్మవారి ఆరాధనకు ప్రత్యేక ప్రాధాన్యత ఉంటుంది. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా జరుపుకునే దసరా పండుగ అనంతరం నిర్వహించే ఉత్సవాలు ప్రజల్లో భక్తిభావాన్ని, ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందిస్తాయి. ఈ నేపథ్యంలో రాయికల్ పట్టణంలో నిర్వహించిన శావ ఉత్సవం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది.

ఉత్సవంలో భాగంగా అలంకరించిన అమ్మవారి ప్రతిమను ప్రత్యేక పల్లకిలో ఊరేగిస్తూ భక్తులు ముందుకు సాగారు. సంప్రదాయ వస్త్రధారణలో పాల్గొన్న భక్తులు, నిర్వాహకులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రివేళ విద్యుత్ దీపాల వెలుగులు, మంగళహారతులు, భక్తుల సందడితో ఉత్సవం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది.

సంప్రదాయాలకు ప్రతీకగా ఉత్సవాలు



స్థానికంగా తరతరాలుగా కొనసాగుతున్న ఆచారాలు, సంప్రదాయాలను కాపాడుకోవడంలో ఇలాంటి ఉత్సవాలు కీలక పాత్ర పోషిస్తాయి. పండుగల సందర్భంగా ప్రజలంతా ఒకచోట చేరి భక్తిశ్రద్ధలతో కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా సామాజిక ఐక్యత, సోదరభావం మరింత బలపడతాయి. యువత కూడా స్థానిక సంప్రదాయాల పట్ల అవగాహన పెంచుకుని వాటిని భావితరాలకు అందించాల్సిన అవసరం ఉందని జగిత్యాల జిల్లా హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ అధ్యక్షుడు ఆడెపు రాజమౌళి అభిప్రాయపడ్డారు.

రాయికల్ పట్టణంలో నిర్వహించిన ఈ శావ ఉత్సవం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. దసరా పండుగ సందడి ముగిసే వరకు ఉత్సవం ద్వారా పట్టణంలో ఆధ్యాత్మిక వాతావరణం కొనసాగుతుంది. ఈ సందర్భంగా ఆలయ పూజారి సతీష్ శర్మ మాట్లాడుతూ భక్తులు విశేషంగా హాజరై అమ్మవారి కృపకు పాత్రులు కాగలరు అని అన్నారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులు విశేషంగా పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు.

మైతాపూర్ గానేగుట్ట వద్ద కోరుట్ల బస్సులు ఆపాలి!!

శ్రీ గాయత్రి దేవి అలంకరణ రూపంలో మహితపూర్ దుర్గ దేవి..







రాయికల్ మండలం అక్టోబర్,12(రిపబ్లిక్ న్యూస్)

జగిత్యాల జిల్లా రాయికల్ మండలం మహితపూర్ గ్రామంలో జరుగుతున్న శ్రీ కనక దుర్గ దేవి అమ్మవారి నవరాత్రు ల సందర్భంగా రెండవరోజు శ్రీ గాయత్రి దేవి అమ్మ వారి రూపంలో భక్తులకు అందరికి దర్శనం ఇచ్చారు. శ్రీ గిరి పర్వతం పైన ఎంతో మంది భక్తులు భక్తి శ్రద్ద లతో పూజ కార్యక్రమం లో పాల్గొన్నారు.. అనంతరం శ్రీ కనక దుర్గ దేవి ఆలయం శ్రీ గిరి పర్వతం పైన అక్కడికి వచ్చిన మహిళలు అందరు ఎంతో సంతోషం గా బతుకమ్మ ను అలంకరణ చేసి బతుకమ్మ ఆడుతూ పాటలు పడుతూ సంబరాలు చేసుకున్నారు. ఇక్కడికి వచ్చిన భక్తులు అందరికి అన్నప్రసాదం అందించారు..

నవరాత్రుల సందర్భంగా బస్సు ను ఆపండి.

మహితపూర్ గ్రామములో ని గన్నే గుట్ట పైన జరుగుతున్న శ్రీ కనక దుర్గ దేవి నవరాత్రు ల సందర్భంగా గ్రమంలో ని ప్రజలు కాకుండా చుట్టూ పక్కల గల గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో భక్తులు వస్తుండడం తో ఘన్నే గుట్ట వద్ద కోరుట్ల నుండి రాయికల్ పోవు ప్రతి బస్సు ను రిక్వెస్ట్ స్టాప్ క్రింద బస్సు లను ఆపాలని భక్తులు నాయకులు అందరు కోరుచున్నారు.

జగన్నాథపూర్‌లో ఇసుక తరలింపు నిలిపివేయాలని ప్రజావాణిలో వినతి



రాయికల్ అక్టోబర్ 12(రిపబ్లిక్ న్యూస్)

జగిత్యాల జిల్లా రాయికల్ మండలం జగన్నాథపూర్ గ్రామ శివారు నుంచి ఇతర మండలాలకు ఇసుక తరలింపును నిలిపివేయాలని కోరుతూ గ్రామస్థులు ప్రజావాణిలో అర్జీ సమర్పించారు. జగనాథ్ పూర్ గ్రామ ఉప సర్పంచ్ కుర్ర మల్లయ్య గారి ఆధ్వర్యంలో మాజి ఎంపీటీసీ అండ్ మాజి సర్పంచ్ విజయ బీర్ సావు మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారుగ్రామంలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్లతో పాటు స్థానిక అవసరాలకు మాత్రమే ఇసుక వినియోగించేలా అనుమతించాలని అధికారులను కోరారు. బయటి ప్రాంతాల వ్యాపారుల కోసం గ్రామంలోని ఇసుక వనరులు తరలిపోకుండా చర్యలు తీసుకోవాలని రాయికల్ మండల రెవెన్యూ అధికారులకు విజ్ఞప్తి చేశారు.

సూరిప్రేమ్ మెమోరియల్ ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో గుత్తి జట్టు విజయం

హుబ్లీ జట్టుపై 10 గోల్స్ తేడాతో గెలుపు..

విజేతకు రూ.50 వేలు, రన్నరప్‌కు రూ.25 వేలు నగదు బహుమతులు



గుత్తి అక్టోబర్ 12 (రిపబ్లిక్ న్యూస్)

పట్టణంలోని గుత్తి ఆర్ఎస్ రైల్వే ఇన్‌స్టిట్యూట్‌లో గౌతమీపురి ఫుట్‌బాల్ అసోసియేషన్, ఆర్డీటీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన సూరిప్రేమ్ మెమోరియల్ రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ టోర్నమెంట్ ముగిసింది. మూడు రోజులపాటు క్రీడాకారుల ఉత్సాహం, అభిమానుల కేరింతల మధ్య సాగిన ఈ పోటీల్లో చివరి రోజు జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో గుత్తి జట్టు సత్తా చాటింది. హుబ్లీ జట్టుతో హోరాహోరీగా తలపడిన గుత్తి జట్టు 10 గోల్స్ తేడాతో విజయం సాధించి విజేతగా నిలిచింది. ఫైనల్ మ్యాచ్‌లో ఇరు జట్ల క్రీడాకారులు నువ్వా నేనా అన్నట్లు పోటీపడ్డారు. ప్రత్యర్థి జట్టుకు అవకాశం ఇవ్వకుండా గుత్తి ఆటగాళ్లు సమన్వయంతో ఆటను కొనసాగించారు. నిర్ణీత సమయంలో గుత్తి జట్టు ఒక గోల్ సాధించగా, హుబ్లీ జట్టు గోల్ చేయడంలో విఫలమైంది. దీంతో 10 గోల్స్ తేడాతో గుత్తి జట్టు విజయాన్ని అందుకుంది. మ్యాచ్ ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగడంతో క్రీడాభిమానులు ఆసక్తిగా తిలకించారు.

విజేతలకు నగదు బహుమతులుటోర్నమెంట్ ముగింపు సందర్భంగా విజేతగా నిలిచిన గుత్తి జట్టుకు నిర్వాహకులు ట్రోఫీతోపాటు రూ.50 వేల నగదు బహుమతిని అందజేశారు. రన్నరప్‌గా నిలిచిన హుబ్లీ జట్టుకు ట్రోఫీతోపాటు రూ.25 వేల నగదు బహుమతిని అందించారు. క్రీడాకారులను అభినందించి, భవిష్యత్తులో మరిన్ని పోటీల్లో పాల్గొని ప్రతిభను చాటాలని నిర్వాహకులు ఆకాంక్షించారు.

రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ టోర్నమెంట్‌ను విజయవంతంగా నిర్వహించేందుకు సహకరించిన గౌతమీపురి ఫుట్‌బాల్ అసోసియేషన్, ఆర్డీటీ ప్రతినిధులు, రైల్వే ఇన్‌స్టిట్యూట్ నిర్వాహకులు, క్రీడాకారులు, సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఇలాంటి పోటీల నిర్వహణతో స్థానిక క్రీడాకారులకు రాష్ట్రస్థాయిలో తమ ప్రతిభను ప్రదర్శించే అవకాశం లభిస్తుందని పేర్కొన్నారు. నవీన్,రాజా, చాంద్ భాష, విజయ్, మోహన్, మహేశ్వర, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.



బోర్నాపెల్లి నుండి జగన్నాథ్ పూర్ మధ్యలో గల పెద్ద వాగుపై వంతెనకు మంజూరి ఇచ్చిన మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్...

రాయికల్ మండలం అక్టోబర్,12(రిపబ్లిక్ న్యూస్)

జగిత్యాల జిల్లా రాయికల్ మండలం బోర్నాపెల్లి నుండి జగన్నాథ్ పూర్ మధ్యలో గల పెద్ద వాగుపై వంతెనకు నిధులు మంజూరయ్యాయని గతంలో జిల్లా మంత్రి అడ్డూరి లక్ష్మణ్ కుమార్ మొదటి సంతకం ఈ ఫైల్ పై సంతకం చేశారని మాజీ మంత్రి ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి అన్నారు మరి ఎందుకు ఇంతవరకు పనులు ప్రారంభించలేదని, "మంత్రి ఉన్నాడు ఎమ్మెల్యే ఉన్నాడు మాజీ ఎమ్మెల్సీ ఉన్నాడు జగన్నాథ్ పూర్ ప్రజలు ఉన్నారు" మరి ఎందుకు ఇంత నిర్లక్ష్యంగా పనూలు ప్రారంభించలేదు మరి నిజమేనా నిధులు మంజూరైనాయా ఎందుకు గిరిజన ప్రజలతో నాయకులు ఆటలాడుకుంటున్నారని జగన్నాథ్ పూర్ ప్రజలు అంటున్నారు వి.వి.రావ్ పేట్ నుండి జగన్నాథ్ పూర్ వరకు రోడ్డుకు రూ.1.16 కోట్లు మంజూరుఆదివాసీలకు



అండగా ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ జగిత్యాల జిల్లా రాయికల్ మండలం వి.వి.రావ్ పేట్ నుండి జగన్నాథ్ పూర్ గ్రామం వరకు రోడ్డు నిర్మాణానికి ఆర్ &బి శాఖ నుండి రూ.1.16 కోట్లు మంజూరయ్యాయి. అని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ తెలిపారు

గ్రామ పెద్దలతో కలిసి జగిత్యాల మ్మెల్యే డా. సంజయ్ కుమార్ ని కలిసి రోడ్డు ధ్వంసమైందని, త్వరగా పునర్నిర్మించాలని కోరారు. ఆదివాసీ గ్రామాలైన బోర్నపల్లి, జగన్నాథ్ పూర్ ప్రజలు రోడ్డు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వివరించారు.స్పందించిన మ్మెల్యే ఆర్ &బి మంత్రి, కాంట్రాక్టర్ తో మాట్లాడి త్వరలో పనులు ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు.

అలాగే బోర్నపల్లి – జగన్నాథపూర్ మధ్య పెద్దవాగుపై వంతెనను కూడా త్వరలో ప్రారంభించాలని సర్పంచ్ మ్మెల్యే ని కోరారుఈ కార్యక్రమంలో సర్పంచ్ పరాచ శంకర్, మాజీ సర్పంచ్ సిడం భీమ్, పటేల్ పెందూర్ సుధాకర్, ఆత్రం తెలంగాణ తదితరులు పాల్గొన్నారు.

గ్రామ గ్రామాన రెపరెపలాడిన బీజేపీ జెండా.

ముక్కా రూపేష్ రెడ్డి.

రైల్వే కోడూరు అక్టోబర్ 12 రిపబ్లిక్ న్యూస్.

రైల్వేకోడూరు నియోజకవర్గంలోని ఓబులవారిపల్లి మండలంలో మన ఊరు మన జెండా' కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. బీజేపీ ఓబులవారిపల్లి మండల అధ్యక్షుడు ముక్కా రూపేష్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గడ్డం చెంగల్ రాజు ఆధ్వర్యంలో మండలంలోని పలు గ్రామాల్లో పార్టీ జెండాలను ఆవిష్కరించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొని జెండా ఆవిష్కరణ కార్యక్రమాలను విజయవంతం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగోతు రమేష్ నాయుడు, తిరుపతి జిల్లా బిజెపి అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్ పాల్గొన్నారు,తిరుపతి జిల్లా అధ్యక్షుడురైల్వేకోడూరులోని బీజేపీ కార్యాలయం వద్ద ఉదయం అల్పాహార విందుతో కార్యక్రమం ప్రారంభమైంది. అనంతరం నాయకులు, కార్యకర్తలు ర్యాలీగా వివిధ గ్రామాలకు చేరుకుని పార్టీ జెండాలను ఆవిష్కరించారు. గద్దలరేవుపల్లి, బి.పి. రాచపల్లి, కాకర్లవారిపల్లి, లింగిరెడ్డిపల్లి, గొబ్బూరోపల్లి, చిన్నంపల్లి, నూకనపల్లి, చెన్నరాజుపోడు గ్రామాల్లో జండా ఆవిష్కరణ కార్యక్రమాలు నిర్వహించారు. గొబ్బూరోపల్లిలో కాలనీ గ్రామానికి తాగునీటి సమస్య ఉండటంతో బిజెపి మండల అధ్యక్షుడు రూపేష్ రెడ్డి సహకారం ద్వారా గోబ్బురువారిపల్లి సీనియర్ నాయకులు శంకరయ్య విషయం తెలిసిపరచగా వెంటనే ఆయన పై అధికారుల దృష్టికి తీసుకువెళ్లి బోరుని వేయించి ఆ బోరులో సోమవారం మోటార్లను బిగించి సాగునీటి సరఫరా అందించడం జరిగింది ఈ విషయంపై గోబ్బురువారి పల్లి గ్రామ ప్రజలు ఆనంద వ్యక్తం చేశారు, అనంతరం గ్రామంలో మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యమిచ్చారు.

ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాబోతు



రమేష్ నాయుడు, తిరుపతి జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్, జిల్లా ఇన్‌చార్జి కృష్ణారెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గడ్డం చెంగల్ రాజు, బీజేవైఎం తిరుపతి జిల్లా ఇన్‌చార్జి బండారు పార్థసారథి, జిల్లా ప్రధాన కార్యదర్శి బీడీ బాలాజీ, మండల ఇన్‌చార్జి అజయ్ కుమార్ తదితర నాయకులు పాల్గొన్నారు.

పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం

'మన ఊరు మన జెండా' కార్యక్రమం ద్వారా గ్రామగ్రామాన పార్టీ జెండాలను ఆవిష్కరించి కార్యకర్తల్లో నూతన ఉత్సాహాన్ని నాయకులు నింపారు,రైల్వేకోడూరు నియోజకవర్గంలోని బీజేపీ నాయకులు, కార్యకర్తలు, పార్టీ అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.ఈ సందర్భంగా ఓబులవారిపల్లి







మండల బీజేపీ అధ్యక్షుడు ముక్కా రూపేష్ రెడ్డి మాట్లాడుతూ, పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. గ్రామస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేస్తూ ప్రజలకు చేరువయ్యే కార్యక్రమాలను కొనసాగిస్తామని తెలిపారు. రానున్న పంచాయతీ ఎన్నికలలో బిజెపి పాల్గొంటుందని గ్రామాలను ప్రజలందరూ బిజెపిని ఆదరించి గ్రామ అభివృద్ధికి తోడ్పడాలని ఆయన కోరారు

కంటి చూపు ప్రసాదించిన శ్రీ కామేశ్వరీ దేవి

- శ్రీ కామేశ్వరీ దేవికి బంగారు కళ్లు చేయించి ఇచ్చిన భక్తురాలు

మహానంది, అక్టోబర్ 12, (రిపబ్లిక్ న్యూస్):

మహానంది క్షేత్రానికి చెందిన కే,శే వనిపెంట లక్ష్మిపుల్లయ్య సతీమణి హేమలతకు గత కొన్ని నెలలుగా కంటి చూపు మందగించింది. కళ్లు సరిగా కనిపించకపోవడంతో ఇబ్బంది పడుతున్న ఆమె వివిధ ఆస్పత్రులలో వైద్యులను సంప్రదించింది. పరీక్షలు నిర్వహించిన వైద్యులు కంటి చూపు రావడం కష్టమని చెప్పారు. దీంతో వేదనకు గురైన ఆమె చివరికి ఆమె నమ్మిన శ్రీ కామేశ్వరి దేవి అమ్మవారికి తన బాధ చెప్పుకుంది. కంటి చూపు మెరుగుపడితే బంగారు కళ్ళు చేయిస్తానని శ్రీ కామేశ్వరీ అమ్మవారికి



మొక్కుకున్నారు.

రెండు నెలల క్రింద తన చూపు మళ్ళీ బాగుపడింది. దీంతో శ్రీ కామేశ్వరీ అమ్మవారికి సుమారు రూ. 50 వేలు విలువ కలిగిన బంగారు కళ్లు చేయించి ఆలయ కార్యనిర్వహణాధికారి ఎన్ శ్రీనివాసరెడ్డి, చైర్మన్ నరాల చంద్రమౌళిరెడ్డి లకు హేమలత కుమారుడు వనిపెంట ఆదిత్య వర్ధన్, తన చిన్నాన్నలైన మహానంది ఉప ప్రధాన అర్చకులు వనిపెంట జనార్ధన్ శర్మ, ముఖ్య అర్చకులు వనిపెంట ప్రకాశం శర్మ తో కలిసి బంగారు నేత్రాలను భక్తితో సమర్పించి మొక్కు చెల్లించుకున్నారు.

ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No./2023/87888

కరువు కోరల్లో రైతులు

కూటమి నేతలు ఏమైపోయారు

సీపీఎం నేత ప్రభాకర్‌రెడ్డి

ఎకరాకు రూ.50 వేల పరిహారం చెల్లించాలి



అనంతపురం కలెక్టరేట్,అక్టోబర్ 12,(రిపబ్లిక్ న్యూస్): పంటలు ఎండిపోతున్నాయి.. పెట్టుబడులు నేలపాలవుతున్నాయి.. అప్పుల భారం పెరుగుతోంది.. వ్యవసాయంపై ఆధారపడిన కుటుంబాలు దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నాయి.. అయినా పాలకుల్లో చలనం లేదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ప్రభాకర్‌రెడ్డి మండిపడ్డారు. జిల్లాలో కరువు పరిస్థితులు రైతుల జీవితాలను అతలాకుతలం చేస్తుంటే కూటమి ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. పంటలు నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.50 వేలు, వర్షాభావంతో సాగు చేయలేక భూములను బీడుగా వదిలేసిన రైతులకు ఎకరాకు రూ.30 వేల పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. సీపీఎం అనంతపురం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం సంగమేశ్వర సర్కిల్ సమీపంలోని పెట్రోల్ బంక్ నుంచి ఎండిపోయిన పంట మొక్కలతో కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించి, అక్కడ ధర్నా చేపట్టారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్‌కు వినతిపత్రం అందజేశారు.

కరువు మండలాల ప్రకటన కాగితాలకే పరిమితం

రాయలసీమను సస్యశ్యామలం చేస్తామని చెబుతున్న పాలకులు క్షేత్రస్థాయిలో రైతుల కష్టాలను ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రభాకర్‌రెడ్డి నిలదీశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాలనలోనైనా తమ కష్టాలు తీరుతాయని ఆశించిన రైతులకు నిరాశే మిగిలిందని విమర్శించారు. తెలుగుగంగ, హంద్రీనీవా, పెన్నహోబిలం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ వంటి ప్రాజెక్టులున్నా జిల్లాలో సాగునీటి సమస్య ఎందుకు కొనసాగుతోందో చెప్పాలన్నారు. ఒకవైపు పంటలు ఎండిపోతుంటే, మరోవైపు అప్పుల భారం రైతులను వెంటాడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. పారిశ్రామిక అభివృద్ధి, హార్టికల్చర్ హబ్‌ల పేరుతో ప్రచారం చేసుకోవడం కాదని, కరువు కోరల్లో చిక్కుకున్న రైతులను ఆదుకునేందుకు కార్యాచరణ ప్రకటించాలని డిమాండ్ చేశారు. కరువు మండలాల ప్రకటన కాగితాలకే పరిమితం కాకుండా రైతుల ఖాతాల్లో పరిహారం జమ కావాలని సీపీఎం నాయకులు స్పష్టం చేశారు. రాయదుర్గం, పెద్దపప్పూరు, పెద్దవడుగూరు మండలాలను కరువు ప్రభావిత ప్రాంతాలుగా ప్రకటించాలని, ఇన్‌పుట్ సబ్సిడీ నిబంధనలను సవరించి పంట నష్టపోయిన రైతులందరికీ పరిహారం అందించాలని కోరారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలి

పంటల బీమా బకాయిలను తక్షణమే చెల్లించడంతోపాటు రైతులు, కౌలు రైతుల రుణాలను మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. కరువు వల్ల వ్యవసాయ పనులు లేక ఉపాధి కోల్పోతున్న కూలీలకు ఏడాదికి 200 రోజుల పని, రోజుకు రూ.600 కూలి కల్పించాలని, కరువు కాలంలో నెలకు రూ.10 వేల భృతి ఇవ్వాలని కోరారు. పేద కుటుంబాలకు నెలకు 50 కిలోల ఉచిత బియ్యం, నిత్యావసర సరుకులు అందించాలని, విద్యార్థుల ఫీజులు మాఫీ చేసి పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. పశువులకు పశు గ్రాసం, తాగునీరు, ఉచిత పశువైద్య సేవలు కల్పించడంతోపాటు గ్రామాల్లో తాగునీటి సమస్యను పరిష్కరించాలని పేర్కొన్నారు. రైతు కుటుంబాలు సంక్షోభంలో కూరుకుపోకుండా ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని, ఆత్మహత్య చేసుకున్న రైతుల కుటుంబాలకు పరిహారం అందించి వారి పిల్లల విద్య, ఆరోగ్య బాధ్యతను ప్రభుత్వమే తీసుకోవాలని డిమాండ్ చేశారు.రైతుల భూములను కార్పొరేట్ సంస్థలకు, సోలార్ ప్రాజెక్టులకు



కేటాయించే విషయంలో చూపుతున్న శ్రద్ధను రైతుల సమస్యల పరిష్కారంలోనూ చూపాలని ప్రభాకర్‌రెడ్డి హితవు పలికారు. కరువు నివారణకు ప్రత్యేక నిధులు కేటాయించి సమగ్ర కార్యాచరణ ప్రకటించాలని కోరారు. రైతులు అప్పుల నుంచి బయటపడేలా, వ్యవసాయ కార్మికులకు ఉపాధి కల్పించేలా తక్షణ సహాయక చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. రైతుల సమస్యలను పరిష్కరించకుండా ప్రకటనలకే పరిమితమైతే పోరాటాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి ఓ. నల్లప్ప, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎస్. నాగేంద్రకుమార్, బాలరంగయ్య, కృష్ణమూర్తి, శ్రీనివాసులు, రామ్‌రెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు భాస్కర్, జగన్‌మోహన్‌రెడ్డి, ముత్తుజా, మన్నిళ్ల రామాంజనేయులు, మారుతి, పరమేష్, వెంకటనారాయణ, ఉద్యాన రైతుల సంఘం నాయకులు శివారెడ్డి, జైచంద్రారెడ్డి, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు సూరి తదితరులు పాల్గొన్నారు.

గజవాహనంపై విహరించిన శ్రీ బ్రహ్మచారిణి దుర్గ

- సకల కార్యదాయినిగా అమ్మవారు ప్రసిద్ధి

- మహానందిలో రెండో రోజు ఘనంగా దసరా నవరాత్రి ఉత్సవాలు





మహానంది, అక్టోబర్ 12, (రిపబ్లిక్ న్యూస్)

మహానంది క్షేత్రంలో దసరా శరన్నవరాత్రి మహోత్సవాల సందర్భంగా రెండవ రోజు సోమవారం పూజలు వైభవంగా జరిగాయి. ట్రస్ట్ బోర్డు చైర్మన్ నరాల చంద్ర మౌళీశ్వర రెడ్డి, ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో వేద పండితులు రవిశంకర్ అవధాని, రుత్విక్కులు, అర్చకులు ఉదయం నుంచి రాత్రి వరకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక యాగశాలలో ఉదయం నుంచి శత చండీ యాగం, శ్రీ చక్ర నవ వరణార్చన, సుహాసిని పూజ జరిపారు. రాత్రి శ్రీ కామేశ్వరి దేవి అమ్మవారికి స్థానిక కళ్యాణ మండపంలో జరిగిన సహస్ర దీపాలంకరణ పూజ కన్నుల పండుగగా జరిగింది. వివిధ ప్రాంతాల భక్తులతో పాటు ఆలయానికి వచ్చిన భక్తులు సహస్ర దీపాలంకరణ పూజలను కనులారా తిలకించి శ్రీ కామేశ్వరీ దేవి అమ్మవారిని దర్శించుకున్నారు.

గజవాహనంపై శ్రీ బ్రహ్మచారిణి దుర్గ:దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మహానందిలో కొలువైన శ్రీ కామేశ్వరీ దేవి అమ్మవారు సోమవారం రాత్రి శ్రీ బ్రహ్మచారిణి దుర్గ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని గజవాహనంపై కొలువు చేసి మహా మంగళ హారతులు, బలిహరణ, తదితర పూజలను నిర్వహించి ఆలయ మాడ వీధుల్లో ఉత్సవంగా ఊరేగించారు. వేలాదిమంది భక్తులు అమ్మవారి అలంకార రూపాన్ని తిలకించి శ్రీ బ్రహ్మచారిణి నమోస్తుతే అంటూ ప్రణమిల్లారు. శ్రీ బ్రహ్మచారిణి దుర్గ అలంకారంలో ఉన్న అమ్మవారిని దర్శించుకోవడం ద్వారా అనుకున్న సకల కార్యాలు నెరవేరుతాయి అని, అమ్మవారు చేతిలో కమండలం, జపమాల ధరించి ఉంటారని వేద పండితులు రవిశంకర అవధాని తెలిపారు. ఉత్సవ కార్యక్రమాల్లో ఆలయ ఏఈఓ ఎరమల మధు, ఆలయ సూపరింటెండెంట్లు అంబటి శశిధర్ రెడ్డి, సుబ్బారెడ్డి, టెంపుల్ ఇన్స్పెక్టర్ నాగమల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

చైల్డ్ మ్యారేజ్ ఫ్రీ విలేజ్ గా మారాలి

కోనేరు స్వచ్ఛంద సంస్థ ఏరియా కోఆర్డినేటర్ మునిస్వామి



గోనెగండ్ల అక్టోబర్ 12,(రిపబ్లిక్ న్యూస్): గ్రామాన్ని బాల్యవివాహ రహిత గ్రామంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా అందరూ కృషి చేయాలని కోనేరు స్వచ్ఛంద సంస్థ ఏరియా కోఆర్డినేటర్ మునిస్వామి పిలుపునిచ్చారు.
సోమవారం గోనెగండ్ల మండలంలోని బి అగ్రహారం గ్రామంలో నిర్వహించిన "చైల్డ్ మ్యారేజ్ ఫ్రీ విలేజ్" అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాల్యవివాహాలు బాలికల భవిష్యత్తును, ఆరోగ్యాన్ని, విద్యను దెబ్బతీస్తాయన్నారు. 18 ఏళ్లు నిండని అమ్మాయికి, 21 ఏళ్లు నిండని అబ్బాయికి వివాహం చేయడం చట్టరీత్యా నేరమని, ఇది బాల్యవివాహ నిరోధక చట్టం – 2006 కింద అమ్మాయి తల్లిదండ్రులకు రెండు సంవత్సరాల జైలు శిక్ష దీంతో పాటు లక్ష రూపాయల జరిమానము బాల్య వివాహానికి హాజరైన వారు పెళ్లి నిర్వహణ మద్దతుదారులు కళ్యాణమండపం వారు టెంట్ హౌస్ వారు వంట మనుషులు ఫోటోగ్రాఫర్స్ వీరందరూ శిక్షార్హమని తెలిపారు.
ప్రతి తల్లిదండ్రులు తమ పిల్లలను, ముఖ్యంగా ఆడపిల్లలను చదివించి ప్రయోజకులను చేయాలే తప్ప, చిన్న వయసులోనే పెళ్లి చేసి భారంగా భావించకూడదని సూచించారు. గ్రామంలో ఎక్కడైనా బాల్యవివాహం జరిగే పరిస్థితి ఉంటే వెంటనే 1098 చైల్డ్ లైన్ నంబర్ కు లేదా ప్రభుత్వ అధికారులకు మరియు పంచాయతీ కార్యకర్తలకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు పంచాయతీ సెక్రటరీ బి రంగస్వామి మహిళా పోలీస్ ఎం చంద్రిక ఏఎన్ఎం ఈ వీరేంద్రమ్మ ఐసిడిఎస్ రంగమ్మ చైల్డ్ హెల్ప్లైన్ 1098 కే విమల ఈశ్వరి సూపర్వైజర్ కోనేరు స్వచ్ఛంద సంస్థ ఏరియా కోఆర్డినేటర్ మునిస్వామి అంగన్వాడీ టీచర్స్ గిరీశ్వరి రాజ్యలక్ష్మి సరోజమ్మ ఆశ వర్కర్స్ రామలక్ష్మిగ్రామ పెద్దలు, యువత అందరూ కలిసి తమ గ్రామాన్ని "బాల్యవివాహ రహిత గ్రామం" గా ప్రకటించుకునేలా తీర్మానం చేయాలని ప్రతిజ్ఞ చేసి పిలుపునిచ్చారు. బాలికా విద్యకు ప్రాధాన్యత ఇస్తేనే గ్రామం అభివృద్ధి చెందుతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, మహిళా సంఘాల సభ్యులు, అంగన్వాడీ కార్యకర్తలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రజారోగ్యం, పాలనే లక్ష్యంగా నూతన భవనాల ప్రారంభం.







రైల్వే కోడూరు అక్టోబర్ 12 రిపబ్లిక్ న్యూస్.

గ్రామీణ ప్రాంతాల ముఖచిత్రాన్ని మారుస్తూ ప్రజా సంక్షేమాన్ని పెంపొందించే దిశగా ఓబులవారిపల్లి మండలం చిన్న ఓరంపాడు గ్రామంలో నూతన అభివృద్ధి కార్యక్రమాలు పండుగ వాతావరణంలో ప్రారంభమయ్యాయి. స్థానిక ప్రజారోగ్యం, పాలనను మరింత బలోపేతం చేసే లక్ష్యంతో చేపట్టిన స్వర్ణ గ్రామ కార్యాలయం, ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ భవనాలకు ప్రజాప్రతినిధులు శంకుస్థాపనల అనంతరం లాంఛనంగా ప్రారంభోత్సవం చేశారు. రైల్వే కోడూరు జనసేన పార్టీ శాసనసభ్యులు అరవ శ్రీధర్, రైల్వే కోడూరు తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి, కడప పట్టణాభివృద్ధి సంస్థ అధ్యక్షుడు ముక్కా రూపానంద రెడ్డి, కోడూరు తెలుగుదేశం నాయకురాలు ముక్కా వరలక్ష్మి సంయుక్తంగా విచ్చేసి రిబ్బన్ కత్తిరించి ఈ భవనాలను ప్రజలకు అంకితం చేశారు.గ్రామీణ ప్రజలకు మెరుగైన, సత్వర వైద్య సేవలు తలుపు తట్టాలనే సంకల్పంతో పదిహేడున్నర లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన ఆరోగ్య కేంద్రం ఇకపై అందుబాటులోకి వచ్చింది. మరోవైపు గ్రామపాలనను సులభతరం చేస్తూ పారదర్శక సేవలు అందించేందుకు నలభై లక్షల రూపాయలతో నిర్మించిన స్వర్ణ గ్రామ కార్యాలయం రూపుదిద్దుకుంది. ప్రజాప్రతినిధుల రాకతో గ్రామంలో కోలాహలం నెలకొంది. డప్పు వాయిద్యాలు, బాణాసంచా పేలుళ్లు, పూల వర్షం నడుమ ఎర్రటి తివాచీ పరిచి నాయకులకు, స్థానిక ప్రముఖులకు గ్రామీణులు, శ్రేణులు అత్యంత వైభవంగా స్వాగతం పలికారు. గ్రామాల సమగ్ర వికాసమే ధ్యేయంగా అడుగులు వేస్తున్నామని ప్రజాప్రతినిధులు ఈ సందర్భంగా స్పష్టం చేశారు.
ఈ వేడుకల్లో సీనియర్ నాయకులు నాగినేని రమేష్ నాయుడు, ఈశ్వర్ నాయుడు, కావర్ల కోటేశ్వర్ నాయుడు,గంగరాజు వెంకటేశ్వరరాజు, మాజీ మండల అధ్యక్షులు పసుపులేటి బ్రహ్మయ్య, ఓబిలి శ్రీధర్, వాసుదేవ రెడ్డి, కోటి,బత్తెన వేణుగోపాల్ రెడ్డి, మల్లికార్జున్ రెడ్డిలతో



పాటు మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎం వి ఎన్ రాజేంద్ర, డిప్యూటీ ఎండిఓ రామ్మోహన్ రెడ్డి, మరియు డిప్యూటీ ఎండిఓ స్వర్ణ గ్రామం కృష్ణ,మండల రెవెన్యూ అధికారి మల్లికార్జునరెడ్డి,పంచాయతీరాజ్ ఏఈ,ఆంజనేయ ప్రసాద్, ఓబులవారిపల్లి సబ్ ఇన్స్పెక్టర్ సుజన్ కుమార్,చిన్నఓరంపాడు సచివాలయకార్యదర్శి మనోహర్, వి ఆర్ ఓ రాంబాబు, మండలవైద్యాధికారి దీప, మరియు సిబ్బంది,తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు వేమన సుబ్రహ్మణ్యం నాయుడు, చంద్రశేఖర్ నాయుడు, మైనార్టీ నాయకుడు జమీర్ అక్బర్ బాషా,మరియు ఇతర సిబ్బంది పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ప్రజల భాగస్వామ్యంతో ఈ కార్యక్రమం అత్యంత ఉత్సాహబరితంగా జరిగింది.

"బ్రాహ్మీముహూర్తం"ఇన్ని చదివిన తరువాత బ్రాహ్మీముహూర్తంలో లేవడాన్ని ఛాదస్తం అని ఎలా అనుకోగలం చెప్పండి!!

-సామాజికవేత్త ఆధ్యాత్మిక దైవచింతన గల వ్యక్తిగా దైవరాధకునిగా సనాత ధర్మ పరిరక్షకుడు- ఆడెపు రాజమౌళి

రాయికల్ మండలం అక్టోబర్,12(రిపబ్లిక్ న్యూస్)

ఉదయాన్నే నిద్రలేవాలని మన పెద్దవాళ్లు తెగ పోరేవారు. అలా చెప్పీ చెప్పీ చాలా తరాలు వెళ్లిపోయాయి. తరం మారుతున్న కొద్దీ జీవనశైలి మారిపోతోంది. నిద్రలేచే సమయాలూ, పనిచేసే వేళలూ మారిపోతున్నాయి. కొన్నాళ్ల తరువాత పని చేయడానికీ, నిద్రపోవడానికీ రాత్రిపగలుతో సంబంధమే లేకపోవచ్చు. కానీ ఇప్పటికీ బ్రాహ్మీముహూర్తం– అన్న మాట అక్కడక్కడా వినిపిస్తూనే ఉంటుంది అని సామాజికవేత్త ఆధ్యాత్మిక దైవచింతన గల వ్యక్తిగా దైవరాధకునిగా సనాత ధర్మ పరిరక్షకుడు– ఆడెపు రాజమౌళి అన్నారు

ఇంతకీ ఆ బ్రాహ్మీముహూర్తం అంటే ఖచ్చితంగా ఏ సమయంలో వస్తుంది. ఆ సమయంలో నిద్రలేవడం వల్ల ప్రయోజనం ఏంటి!

సూర్యోదయానికి 96 నిమిషాల ముందున్న కాలాన్ని బ్రాహ్మీముహూర్తం అంటారు. అయితే రుతువుని బట్టి సూర్యోదయ వేళలు మారిపోతూ ఉంటాయి కాబట్టి, 4:00 –4:30 ని బ్రాహ్మీముహూర్తంగా అనుకోవచ్చు. బ్రాహ్మీ



అంటేనే సరస్వతి అని అర్థం. మన పెద్దలు చాలా ఆలోచించే ఆ పేరు పెట్టారేమో అనిపిస్తుంది. ఈ సమయంలో నిద్రలేవడం వల్ల ఉపయోగం ఏంటి అని అడిగే ప్రశ్నకు చాలానే జవాబులు వినిపిస్తాయి.
ఆ సమయంలో ప్రకృతి మొత్తం ప్రశాంతంగా, నిద్రలోని ఆఖరి జాములు గడుపుతూ ఉంటుంది. సూర్యుని వేడి భూమిని కాస్త తాకుతూ ఉంటుంది, కానీ వెలుతురు ఇంకా మనల్ని చేరుకోదు. అంటే రాత్రివేళ చల్లదనాన్నీ, పగటివేళ చురుకుదనాన్నీ ఏకైక కాలంలో కలిగిఉండే సమయం ఇదన్నమాట! అందుకే ఈ సమయంలో మనుషులు సత్వగుణం ప్రధానంగా ఉంటారట. లేలేత కిరణాలు శరీరాన్ని తాకడం చాలా మంచిదని వైద్యులు కూడా చెబుతున్నారు కాబట్టి, ఉదయాన్నే లేచి కాలకృత్యాలు తీర్చుకుని సూర్యనమస్కారాలు చేయడమో, వ్యాహ్యాళికి వెళ్లడమో చేస్తే ఆరోగ్యానికి మంచిది.
మనలో జీవగడియారం అనేది ఒకటి ఉంటుంది. అది మనం ఏర్పరుచుకున్న అలవాట్లను బట్టీ, ప్రకృతిని బట్టీ నడుచుకుంటూ ఉంటుంది. నిద్రపోవడం, లేవడం, కాలకృత్యాలు తీర్చుకోవడం ఇవన్నీ సమయానికి అనుకూలంగా చేస్తేనే ఆరోగ్యంగా ఉంటాం. సాక్షాత్తూ ఆయుర్వేదమే –తన ఆరోగ్యాన్నీ, ఆయుష్షునూ కాపాడుకోవాలని అనుకునేవాడు బ్రాహ్మీముహూర్తంలో లేవాలి– అని చెబుతోంది. పైగా ఆయుర్వేదం ప్రకారం ఈ సమయం –వాత– ప్రధానంగా ఉంటుంది. శరీరంలో కదలికలనీ, ఆలోచనలనీ, రక్తప్రసరణనీ ప్రభావితం చేసేది ఈ –వాత– లక్షణం. ఈ లక్షణం మన శరీరంలో ప్రముఖంగా ఉన్నప్పుడు మనం ఎలాంటి పనినైనా చురుగ్గా చేయగలం ప్రశాంతంగా ఉండగలం మంచి ఆలోచనలు చేయగలం చదివినదానిని ఆకళించు చేసుకుని దీర్ఘకాలం జ్ఞప్తికి ఉంచుకోగలం.ధ్యానం చేయాలనుకునేవారికి కూడా ఈ సమయం చాలా అనుకూలమని యోగశాస్త్రం చెబుతోంది. మన శరీరంలో ఇడ, పింగళ, సుషుమ్న నాడులు ఉంటాయిని యోగుల నమ్మకం. బ్రాహ్మీముహూర్తంలో సుషుమ్న నాడి చాలా ఉత్తేజితంగా ఉండిడ ధ్యానం చాలా సులువుగానూ, ప్రభావవంతంగానూ సాగే అవకాశం ఉంటుందట.



ఉదయాన్నే మన శరీరంలోనూ, చుట్టూ ఉన్న ప్రకృతిలోనూ ఉండే ప్రశాంతత వల్ల యోగా, ధ్యానం, చదువుడ చాలా తేలికగా ప్రభావవంతంగా సాగుతాయి. రోజువారీ చేయాల్సిన విధులకు (ఉద్యోగం, కాలేజ్, వంటావార్పుడ) ముందు కాస్త సమయం చేజిక్కుతుంది. అలా కాకుండా ఆలస్యంగా లేచి ఒక్కసారిగా మన పనులలో చేరేందుకు పరిగెత్తడం వల్లడ మన మనసు, శరీరం విపరీతమైన ఒత్తిడికి లోనవుతాయి.గుండెజబ్బులు ఉన్నవారికి తెల్లవారుజామునే గుండెపోటు వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుందనీ, పైగా అలా వచ్చే గుండెపోటు చాలా తీవ్రంగా ఉంటుందనీ వైద్య గణాంకాలన్నీ సూచిస్తున్నాయి. గుండెల్లో రక్తనాళాలను గడ్డకట్టించే –థ్రోంబస్– అనే సమస్య ఉదయం వేళల్లోనే ఎక్కువగా ఉంటుందట. ఇలా ఎందుకు జరుగుతుందనే దానికి ఖచ్చితమైన కారణాలు ఏవీ చెప్పలేకపోతున్నారు వైద్యులు. పైగా ఇదే సమయంలో మనం హడావుడిగా లేచి విధుల్లోకి చేరాలనే టెన్షన్‌లో మనలోని రక్తపోటు మరింత ఎక్కువై అది గుండెపోటుకి దారితీసే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి.
అయితే బ్రాహ్మీముహూర్తంలోనే నిద్రలేచి, వీలైతే కాసేపు ధ్యానం చేసుకునిడ స్థిమితంగా రోజువారీ పనులకి సిద్ధపడితే మన రక్తపోటు కూడా సాధారణంగా ఉండే అవకాశం ఉంటుంది. ఇన్ని చదివిని తరువాత బ్రాహ్మీముహూర్తంలో లేవడాన్ని ఛాదస్తం అని ఎలా అనుకోగలం చెప్పండి!!అని ఆడెపు రాజమౌళి అన్నారు